తెలుగు దినపత్రిక

https://aksharagalam.com

# అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం

పేజీలు : 08 | వెల: రూ.3 | సంపుటి: 03 | సంచిక 133 | ఎడిటర్: దయాకర్ రెడ్డి | ఆదివారం, 12 అక్టోబర్ 2025

## బనకచర్లను అడ్డుకుని తీరుతాం

### హరీశ్‌రావుది అసత్య ప్రచారం
### మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించే ప్రసక్తే లేదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అడ్డుకుని తీరుతామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇటీవల మాతృవియోగం పొందిన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని.. ఉత్తమ్ మరో మంత్రి సీతక్కతో కలిసి శనివారం హనుమకొండలో పరామర్శించారు. అనంతరం అక్కడే విలేకరులతో మాట్లాడారు. "బనకచర్లపై కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను స్వయంగా కలిసి లిఖితపూర్వకంగా

-మిగతా 2లో



## 42 శాతం

### రిజర్వేషన్లకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

- బీజేపీ, బీఆర్‌ఎస్ కలిసి బీసీ రిజర్వేషన్లను అడ్డుకునే కుట్ర
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ విమర్శలు

హైదరాబాద్: తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని మరోసారి టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్‌ల జీవోను, ఎన్నికల నోటిఫికేషన్ అమలుపై హైకోర్టు స్టే ఇచ్చినందున సుప్రీంకోర్టుకు వెళ్లి అప్పీలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అక్కడ వెసులు బాటు దొరుకుతదని ఆశిస్తున్నట్లు తెలిపారు. రిజర్వేషన్లు ఆపటంలో అసలైన ముద్దాయి బీజేపీ అని విమర్శించారు. బీజేపీ, బీఆర్‌ఎస్ కలిసి బీసీ రిజర్వేషన్లను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. గవర్నర్ దగ్గర బిల్లుని పెండింగ్ లో ఉంచారని.. గవర్నర్‌ను నియమించేది ఎవరని ప్రశ్నించారు. మూడు చట్టాలు ఒక ఆర్డినెన్సు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. బీసీలకు నోటి దాకా వచ్చిన ఫలాలను అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉందన్న ఆయన.. మోదీ బీసీ ప్రధాని అని చెప్పుకునే బీజేపీ నేతలు, బీసీ రిజర్వేషన్ బిల్లుపై ఎందుకు ఒత్తిడి తీసుకురావటం లేదు? అని ప్రశ్నించారు. ఏపీ ప్రాజెక్టు బనకచర్ల విషయంలో చేయాల్సింది అంత చేశారని విమర్శించారు. బీఆర్‌ఎస్ ఉదాసీనత వల్ల జీవో ఇచ్చారని దుయ్యబట్టారు.



## 24 గంటలూ సందర్శకుల్ని ఆకర్షించాలి

### నవంబరులోగా పనులు ప్రారంభించాలి : సీఎం

# ఐకానిక్‌గా టీస్క్వేర్

## ఆ కట్టడంపై అంతర్జాతీయస్థాయి డిజిటల్ ఎలివేషన్

హైదరాబాద్: రాయదుర్గంలో నిర్మించతలపెట్టిన టీస్క్వేర్‌ను ఐకానిక్‌గా తీర్చిదిద్దాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. నవంబరు నెలాఖరునాటికి పనులు ప్రారంభించాలని సూచించారు. రాష్ట్రంలోని విద్యార్థులు, ఉద్యోగులు, కార్మిక బలగానికి కృత్రిమ మేధ%ఐ% నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ఏఐ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. ఏఐహబ్ తాత్కాలిక వసతి కోసం ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీలో భవనాలు పరిశీలించాలన్నారు. ఈ హబ్ కోసం ప్రపంచ ప్రసిద్ధిచెందిన పలు సంస్థల ప్రతినిధులతో ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. శనివారమిక్కడ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి టీస్క్వేర్, ఏఐ హబ్ ప్రతిపాదిత అభివృద్ధి ప్రణాళికలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు."సోషల్ మీడియా యుగం అవసరాల నేపథ్యంలో హైదరాబాద్‌ను ఒక డిజిటల్ కాన్వాస్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. టీస్క్వేర్ నిర్మాణానికి అత్యుత్తమ ప్రమాణాలతో, ప్రపంచ దృష్టిని ఆకర్షించేలా డిజైన్లు పరిశీలించి అధికారులు ఆమోదించాలి. దీన్ని వినోదం, పర్యాటకం, ఆహారం, వ్యాపార కూడలిగా రూపొందించి, 24 గంటలూ సందర్శకుల్ని ఆకర్షించాలి. పెద్ద ఎలక్ట్రానిక్ డిస్‌ప్లేలు, డిజిటల్ ప్రకటనలతో ప్రపంచస్థాయి డిజిటల్ డిస్‌ప్లే ఎలివేషన్‌గా ఈ కట్టడాన్ని తీర్చిదిద్దాలి. తద్వారా అక్కడికి వచ్చే సందర్శకులకు ఉల్లాసభరితమైన అనుభూతిని అందించాలి. పార్కింగ్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా డిజైన్లు ఆమోదించాలి. టీస్క్వేర్ భవనంలో యాపిల్ లాంటి అంతర్జాతీయ బ్రాండ్లు తమ అవుట్‌లెట్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి. ఇందులో యుటిలిటీ జోన్ ఉండాలి" అని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

### ఒకే గొడుగు కిందకు

రాష్ట్రంలో ఏఐ కార్యక్రమాలు, స్టార్టప్‌లు, సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లను ఒకేగొడుగు కిందకు తీసుకువస్తూ నగరంలో ఏఐ ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేయనున్నాం. ప్రపంచ కంపెనీలు, పరిశోధన సంస్థలు, అంతర్జాతీయ ఏఐ హబ్‌లు సహకరించుకుంటూ నూతన ఆవిష్కరణలు రూపొందించేందుకు ఇది వేదికగా మారుతుంది. ఏఐ ఆధారిత ఆవిష్కరణలతో పాటు స్టార్టప్‌ల మద్దతుకు కార్పస్‌ఫండ్ ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. ఏఐలో తెలంగాణను అగ్రగామిగా నిలబెట్టేందుకు ప్రభుత్వం 2024 నుంచి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. గతేడాది సెప్టెంబరులో గ్లోబల్ ఏఐ సమ్మిట్ నిర్వహించాం. ప్రభుత్వ అధికారుల కోసం ఏఐ కేటలిస్ట్ ప్రోగ్రాం రూపొందించాం. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రస్థాయి డిజిటల్ ప్రజామౌలిక సదుపాయాలైన తెలంగాణ డేటా ఎక్స్ఛేంజ్ (టీజీడెక్స్) ప్రారంభించాం" అని సీఎం తెలిపారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేశ్‌రంజన్, సంజయ్‌కుమార్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, టీజీఐఐసీ ఎండీ శశాంక, టీఫైబర్ ఎండీ వేణుప్రసాద్, ఐటీశాఖ డిప్యూటీ కార్యదర్శి భవేశ్‌మిశ్రా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నా శాఖలో పొంగులేటి పెత్తనం..

02

మంత్రి కొండా సురేఖ ఫిర్యాదు

## వరంగల్ టెక్స్‌టైల్ పార్కులో టీషర్టుల ఉత్పత్తిపై కేటీఆర్ హర్షం



హైదరాబాద్: వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో ఉత్పత్తిపై భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ (%ఖు=%) హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. మొదటి యూనిట్ ఉత్పత్తి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రపంచ మార్కెట్లకు టీషర్టులు ఎగుమతి చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వ హయాంలో 2023లో కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో ఫ్యాక్టరీలకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. 11 యంగ్ వన్ కార్పొరేషన్ ఫ్యాక్టరీలకు భూమిపూజ చేశామన్నారు. అన్ని యూనిట్లు ప్రారంభమైతే.. వరంగల్ ప్రధాన వస్త్ర కేంద్రంగా మారుతుందని వివరించారు. 'వ్యవసాయం నుంచి ఫ్యాషన్' నినాదంతో టెక్స్‌టైల్ పార్కును స్థాపించినట్లు కేటీఆర్ చెప్పారు

## వికసిత్ భారత్‌లో రైతులది ముఖ్య భూమిక

### ఎగుమతి చేసేలా వాణిజ్య పంటలను పండించాలి

- ఇతర దేశాలపై ఆధారపడకుండా స్వయంసమృద్ధి సాధించాలి
- జీఎస్‌టీ సంస్కరణతో రైతులు, గ్రామీణ రంగానికి ప్రయోజనం
- సాగు వ్యయం తగ్గించేందుకు ఐదేళ్లలో రూ.13లక్షల కోట్ల సబ్సిడీ
- ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని ప్రారంభించిన మోడీ

**న్యూఢిల్లీ,అక్టోబరు11(అక్షరగళం):** దేశం వికసిత్ భారత్ వైపు అడుగులు వేయడంలో రైతులు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని ప్రధాని మోదీ అన్నారు. భారత్ ఇతర దేశాల దిగుమతులపై ఆధారపడకుండా ఉండాలంటే.. కేవలం వరి, గోధుమ పంటల పైనే కాకుండా ప్రొటీన్ అధికంగా లభించే పప్పులకు సంబంధించిన సాగును మరింత పెంచాలని రైతులకు సూచించారు. ప్రపంచ మార్కెట్‌లకు ఎగుమతి చేసేలా వాణిజ్య పంటలను పండించాలన్నారు. దేశంలో పంటల ఉత్పత్తికి అయ్యే ఖర్చులు తగ్గించి.. రైతుల ఆదాయం పెంచే దిశగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో పదేళ్లలో వ్యవసాయ రంగంలో కేవలం రూ.5 లక్షల కోట్ల సబ్సిడీలు ఇస్తే.. తమ ప్రభుత్వం పదేళ్లలో రైతులకు రూ.13 లక్షల కోట్లకు పైగా సబ్సిడీలు ఇచ్చిందని పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో శనివారం నాడు జరిగిన ప్రత్యేక కృషి

-మిగతా 2లో



## బనకచర్లపై సర్కారు మౌనమేల?

### కేంద్రం లేఖ రాసి 20 రోజులవుతున్నా స్పందన లేదు: హరీశ్‌రావు



**హైదరాబాద్,అక్టోబర్11(అక్షరగళం):** ఏపీ చేపడుతున్న గోదావరి – బనకచర్ల లింక్ ప్రాజెక్టు పీఎఫ్‌ఆర్ పరిశీలన ప్రక్రియ పురోగతిలో ఉందంటూ కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ రాష్ట్రానికి లేఖ రాసి ఇరవై రోజులు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం మౌనంగా ఎందుకు ఉంటోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు ప్రశ్నించారు. శనివారం భారాస ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'బనకచర్ల విషయంలో కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వ సహకారంతో ఏపీ క్రమంగా ముందుకు వెళ్తుంటే.. సీఎం రేవంత్‌రెడ్డి ఏపీకి పూర్తిగా సహకరిస్తున్నారు. వరద జలాలపై డీపీఆర్ పరిశీలన ఉండదు. దీనిపై కేంద్రాన్ని నిలదీయాల్సిన సీఎం ఎందుకు మౌనంగా ఉన్నారు? ఈ ప్రాజెక్టుతో 423 టీఎంసీలు ఏపీ తీసుకుంటే ఎగువ రాష్ట్రాల వాటాగా కృష్ణాలో 112 టీఎంసీలు ఆపుతామని కర్ణాటక, 74 టీఎంసీలు ఆపుతామని మహారాష్ట్ర గత నెలలోనే కేంద్రానికి లేఖలు రాశాయి. దీనివల్ల అంతిమంగా తెలంగాణకు వచ్చే కృష్ణా జలాలపై ప్రభావం పడదా? ఈ విషయంలో ప్రభుత్వం మొద్దునిద్ర పోతోంది. బనచకర్ల సాధ్యం కాదని సీడబ్ల్యూసీ, అటవీశాఖ, పోలవరం అథారిటీలు ఇప్పటికే స్పష్టం చేసినా.. చంద్రబాబు ఒత్తిడికి భాజపా తలొగ్గుతోంది. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, సంజయ్‌లకు బాధ్యత లేదా? సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా దిల్లీకి వెళ్లి పోరాడతారా లేదా? మొన్న మల్లికార్జున ఖర్గేను పరామర్శించేందుకు కర్ణాటక వెళ్లినప్పుడైనా.. ఆలమట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచొద్దంటూ ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని సీఎం కోరలేదు. భారాస, కేసీఆర్‌లతోనే తెలంగాణ నీటి హక్కులకు రక్షణ అనేది ప్రజలు గమనించాలి.' అని పేర్కొన్నారు.





# వికసిత్ భారత్‌లో రైతులది ముఖ్య భూమిక

-మొదటి పేజీ తరువాయి

ప్రోగ్రాంలో ప్రధాని మాట్లాడారు. ఈ సందర్భంగా గత నెలలో అమల్లోకి వచ్చిన జీఎస్‌టీ సంస్కరణతో రైతులు, దేశం లోని గ్రామీణ రంగానికి మరింత ప్రయోజనం చేకూరిందని మోదీ చెప్పారు. గత ప్రభుత్వాల కు వ్యవసాయం పై ఎలాంటి విజన్ లేదని విమర్శించారు. రైతుల ఆదాయం పెంచేందు కు, పంటల సాగు వ్యయం తగ్గించేందుకు గత పదేళ్లుగా ఎన్డీయే ప్రభుత్వం ఎరువులపై రూ.13లక్షల కోట్ల సబ్సిడీ ఇచ్చిందని ప్రధాని మోదీ అన్నారు. యూపీఏ పదేళ్లలో రూ.5 లక్షల కోట్లు మాత్రమే సబ్సిడీగా ఇచ్చింద న్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు వ్యవసాయరంగానికి ప్రభుత్వం బాసటగా నిలుస్తోందని వివరించారు. రైతులకు కేంద్రంలోని గత కాంగ్రెస్ ప్రభుత్వం చేసేందేమి లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. 2004 నుంచి 2014 వరకూ యూపీఏ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు వ్యవసాయరంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. అయితే బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 11 ఏళ్లుగా రైతుల అభివృద్ధి, స్వయం సమృద్ధికి ఎన్నో చర్యలు తీసుకుందని వివరిం చారు. వ్యవసాయరం గానికి సంబంధించిన వివిధ శాఖలు ఇష్టారీ తిలో వ్యవహరించడం వల్ల దేశంలోని వ్యవస్థాయ వ్యవస్థ బలహీన మవుతూ వచ్చుందన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిలో మార్పులు చేస్తూ విత్తనాల దగ్గర నుంచి మార్కెట్ వరకూ రైతులకు ప్రయోజ నాలు చేకూరే లెక్కలేనని సంస్కరణలు తెచ్చామ ని చెప్పారు. దేశ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమ తులు దాదాపు రెట్టింపయ్యాయని, ఆహారధా న్యాలు, పళ్లు, కాయగూరల ఉత్పత్తి సుమారు 90 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెరిగిందని, గతంలో ఇది 64 మిలియన్ మెట్రిక్ టన్నులుగా ఉండేదని చెప్పారు. 2014 నుంచి తేనె ఉత్పత్తి రెట్టింపు అయిందని అన్నారు. అభివృద్ధి భారతాన్ని కోరుకుంటే ప్రతి రంగంలోనూ ఇండియా బలపడాల్సి ఉంటుందన్నారు. ఏవో కొన్ని సాధించినంత మాత్రాన తృప్తి పడిపోరాదని సూచించారు. వెనుకబడిన ప్రాంతాలపై దృష్టి పెట్టినప్పుడే గణనీయమైన ఫలితాలు ఉంటాయన్నారు. ఇవాళ యాస్పిరేషనల్ జిల్లాల్లో ప్రసూతి మరణాలు తగ్గాయని, చైల్డ్ హెల్త్ మెరుగైందని, విద్యాప్రమాణాలు పెరిగాయని చెప్పారు. దీంతో ఈ జిల్లాలు ఇతర జిల్లాల కంటే మెరు గైన రీతిలో దూసుకెళ్తున్నాయని, ఈ మోడల్ ఆధారంగా వ్యవసాయంలో వెనుకబడిన 100 జిల్లాలను అభివృద్ధి చేసేందుకు దృష్టి సారించామని, ఇందువల్ల అవి మరింత మెరుగైన జిల్లాలుగా మారనున్నాయని చెప్పారు. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే అన్ని రంగాల్లో నిరంతరం కొత్త మార్పులు చోటుచేసుకోవాలని ప్రధాని పేర్కొన్నారు. ఈ ఆలోచనలో భాగంగానే ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. గత ప్రభుత్వాలు దేశంలోని 100కు పైగా జిల్లాలను వెనకబడిన జిల్లాలుగా ప్రకటించి.. ఆపై వాటిని పూర్తిగా మరిచిపోయాయని ప్రధాని మండిపడ్డారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ వెనకబడిన జిల్లాలపై ప్రత్యేక దృష్టిసారించి, వాటిని ఆశావహ జిల్లాలుగా ప్రకటించినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడానికి తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రాజెక్టులను అమలుచేస్తోందన్నారు. వీటన్నింటినీ ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన కిందకు తీసుకువస్తున్నట్లు తెలిపారు. వెనకబడిన జిల్లాలలోని అనేక ప్రాంతాల్లో గత పాలకులు రోడ్లు కూడా వేయించలేదని.. అటువంటి వాటిని తమ ప్రభుత్వం డిజిటల్ ఇండియా దిశగా నడిపిస్తోం దన్నారు. గ్రామీణప్రాంత ప్రజలకు విద్య, వైద్యం, నివాసం, విద్యుత్, రోడ్డు వంటి అన్నిరకాల సదుపాయాలు కల్పించడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత పదకొండేళ్లలో రైతులు పలు విజయాలు సాధించారని.. పదివేలకు పైగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పడ్డాయన్నారు.

# జొన్న, మక్కలను మద్దతు ధరల పథకంలో చేర్చాలి

## కేంద్ర వ్యవసాయ మంత్రికి తుమ్మల లేఖ



**హైదరాబాద్:** మద్దతు ధరల పథకం (పీఎస్ఎస్) పరిధిలోని పంట ఉత్పత్తులను వంద శాతం కేంద్రమే కొనుగోలు చేయాలని, ప్రస్తుతమున్న 25% సీలింగ్‌ను ఎత్తివేయాలని రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఈ పథకం పరిధిలో నువ్వులు, శనగలు, వేరుసెనగ, సోయాబీన్, పెసలు ఉన్నాయని... జొన్న, మక్కలను సైతం చేర్చాలని కోరుతూ కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు మంత్రి శనివారం లేఖ రాశారు. పత్తి, పామాయిల్‌కు సంబంధించిన దిగుమతి సుంకాల విధానం దేశీయ మార్కెట్ సీజన్‌లకు అనుగుణంగా ఉండేలా కేంద్ర వ్యవసాయశాఖ చర్యలు తీసుకోవాలని కోరారు. దేశవ్యాప్తంగా ధనధాన్య కృషి యోజనను ప్రధానమంత్రి నరేంద్రమోదీ శనివారం దిల్లీలో ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని మంత్రి తుమ్మల తన నివాసం నుంచి వీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని నాలుగు జిల్లాలను పథకంలో చేర్చడంపై శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సైతం జాతీయ వ్యవసాయ పరిశోధన, నిర్వహణ సంస్థ(నార్మ్)లో పథకం ఆవిష్కరణను ఆన్‌లైన్‌లో చూశారు. అనంతరం ఐఐఓఆర్‌లో సంస్థ డైరెక్టర్ ఆర్‌కే మాథుర్‌తో కలిసి రైతులకు కుసుమ విత్తనాలను పంపిణీ చేశారు.

# బనకచర్లను అడ్డుకుని తీరుతాం

-మొదటి పేజీ తరువాయి

తెలంగాణ అభ్యంతరాలు తెలిపాం. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నప్పటికీ మేం ఆలమట్టి ఎత్తు పెంపును వ్యతిరేకిస్తున్నాం. బనకచర్ల విషయంలో మాజీ మంత్రి హరీశ్‌రావు అసత్య ప్రచారాలు చేస్తున్నారు. కృష్ణా, గోదావరి జలాశయాల్లో తెలంగాణకు నష్టం జరగడానికి కారణం భారాసయే. కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన నీటి వాటాపై మేం ట్రైబ్యునల్ ఎదుట సమర్థంగా వాదనలు వినిపించాం. ఈ విషయంలో రాజీ పడబోం' అని ఉత్తమ్ వివరించారు. సమావేశంలో ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యేలు నాగరాజు, మాధవరెడ్డి, రామచంద్రునాయక్ పాల్గొన్నారు.

# అధిక వడ్డీ పేరుతో రూ.50 కోట్ల మోసం..

## నిందితుడి అరెస్టు




నల్గొండ: అధిక వడ్డీ పేరుతో రూ.50 కోట్ల మేర మోసానికి పాల్పడిన నిందితుడిని నల్గొండ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి రెండు విలువైన కార్లు, ఆస్తి పత్రాలు, బాధితులకు ఇచ్చిన ప్రామిసరీ నోట్లు, 7 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను ఎస్పీ శరత్ చంద్ర పవార్ మీడియాకు వెల్లడించారు. పీఏ పల్లి మండలం, వద్దిపట్ల గ్రామానికి చెందిన రమావత్ బాలాజీ 2020లో ఐస్‌క్రీమ్ పార్లర్ వ్యాపారం ప్రారంభిస్తానని చెప్పి.. బంధువుల వద్ద రూ.5 లక్షలు రూ.2ల వడ్డీకి తీసుకున్నాడు. వ్యాపారంలో నష్టపోయి.. రియల్ ఎస్టేట్ వ్యాపారం వైపు అడుగులు వేశాడు. రూ.6 వడ్డీ చొప్పున అదే గ్రామానికి చెందిన వారి దగ్గర నుంచి రూ.15 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. సకాలంలో వడ్డీ చెల్లిస్తూ నమ్మకం కలిగించాడు. మరికొంత మంది ఏజెంట్లను నియమించుకొని.. చుట్టుపక్కల గిరిజన తండాల్లో అధిక వడ్డీకి అప్పులు తీసుకున్నాడు. ఈ డబ్బుతో బంధువులు, స్నేహితుల పేరిట వ్యవసాయ భూములు, ఇళ్లు, ఖరీదైన కార్లు, బైక్‌లు కొనుగోలు చేసి జల్సాలు చేసేవాడు. ఇంకా అధిక డబ్బులు వసూలు చేసే ఉద్దేశంతో నెలకు రూ.10 వడ్డీ ఇస్తానని జనాలను నమ్మించి రూ.కోట్లలో డబ్బులు వసూలు చేసి.. వడ్డీ మాత్రమే ఇచ్చి బాధితుల వద్ద ఉన్న ప్రామిసరీ నోటు వెనుక వడ్డీ ఇచ్చినట్లు రాసి ఇచ్చేవాడు. బ్యాంక్‌లో వచ్చే వడ్డీ కంటే పది రేట్లు ఎక్కువ వడ్డీ ఇవ్వడంతో జనాలు ఆకర్షితులై బాలాజీ నాయక్‌కి అధికమొత్తంలో డబ్బులు ఇచ్చారు. గత కొన్ని నెలలుగా బాధితులకు అసలు, వడ్డీ డబ్బులు ఇవ్వలేకపోయే సరికి.. వారంతా అతడిపై ఒత్తిడి చేయడం ప్రారంభించారు. దీంతో వారి నుంచి తప్పించుకొని పారిపోయాడు. తాజాగా నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు.. రిమాండ్‌కి తరలించారు.

# బిసి రిజర్వేషన్లపై సుప్రీంను ఆశ్రయించండి

## ఇప్పటికే చాలా ఆలస్యం అయ్యిందన్న కవిత

**హైదరాబాద్,అక్టోబర్11:** తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల జీవో, ఎన్నికల నోటిఫికేషన్ అమలును నిలిపివేస్తూ హైకోర్టు ఇచ్చిన స్టేపై సుప్రీంకోర్టును రేవంత్ సర్కార్ ఆశ్రయించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. ఇప్పటికే చాలా ఆలస్యం అయ్యిందని.. ఇకనైనా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆమె స్పందించారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రాజకీయ రిజర్వేషన్లతోపాటు విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులకు రాష్ట్ర అసెంబ్లీ, కౌన్సిల్ ఆమోదం తెలిపి 6 నెలలు గడిచిందని గుర్తు చేశారు. ఈ రెండు బిల్లులు రాష్ట్రపతి వద్దకు చేరినా ఆమోదం పొందలేదని తెలిపారు. ఈ బిల్లుల చట్టబద్ధత కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం చిన్న ప్రయత్నం కూడా చేయలేదని విమర్శించారు. 2018 పంచాయతీ రాజ్ చట్టానికి సవరణ చేసి బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించే సవరణ బిల్లు గవర్నర్ దగ్గర పెండింగ్ లో ఉందని చెప్పారు. అసెంబ్లీ, కౌన్సిల్ ఆమోదించిన బిల్లులు రాష్ట్రపతి వద్ద, చట్ట సవరణ బిల్లు గవర్నర్ వద్ద పెండింగ్ లో ఉండగానే రేవంత్ సర్కార్ తెచ్చిన జీవో నం.9 పై హైకోర్టు స్టే విధించిందని పేర్కొన్నారు. ఈరోజు ఉదయం 8.30 గంటల ప్రాంతంలో హైకోర్టు ఉత్తర్వుల కాపీ అందిందని చెప్పారు. అసెంబ్లీ, కౌన్సిల్ ఆమోదించిన బిల్లులను ఆరు నెలలుగా కోల్డ్ స్టోరేజీలో పెట్టిన కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రపతిపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించి న్యాయ పోరాటం చేయాలని పేర్కొన్నారు. అటు రాష్ట్ర ప్రభుత్వం సైతం స్థానిక సంస్థల ఎన్నికలపై ఎలా ముందుకెళ్లాలనే దానిపై యోచిస్తోంది. లోకల్ బాడీ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల జీవో, ఎన్నికల నోటిఫికేషన్ అమలును నిలిపివేస్తూ హైకోర్టు ఇచ్చిన స్టేపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందుకోసం అత్యున్నత న్యాయస్థానంలో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. హైకోర్టు ఇచ్చిన స్టేను ఎత్తివేసి ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు పర్మిషన్ ఇవ్వాలని కోరనున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల పక్రియ, నామినేషన్ల స్వీకరణ కూడా మొదలైనందున హైకోర్టు జోక్యం సరికాదని సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం బలమైన వాదనలు వినిపించనుంది.

# సిఎం రేవంత్ రెడ్డి నల్లమల పిల్లి

## కృష్ణా, గోదావరి నీళ్లు దోస్తున్నా ఉలుకేదీ


### బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు వెటకారం



**హైదరాబాద్,అక్టోబర్11(అక్షరగళం):** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నల్లమల పులి కాదు.. నల్లమల పిల్లి అని మాజీ మంత్రి హరీశ్‌రావు సెటైర్లు వేశారు. కింది నుంచి గోదావరి నీళ్లు ఏపీ తీసుకుపోతే.. పైన కృష్ణా నీళ్లు కర్ణాటక తీసుకుపోతే, మన బ్రతుకు ఏం కావాలని హరీశ్‌రావు ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో హరీశ్ రావు మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి మొన్న మల్లికార్జున ఖర్గేను పరామ ర్శించడానికి కర్ణాటకకు వెళ్లినప్పుడు, ఆలమట్టి డ్యాం ఎత్తు పెంపు గురించి సిద్ధరామయ్య, శివకుమార్ దగ్గర మాట్లాడు తాడను కున్నా. వాళ్ళ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అయినా రేవంత్ రెడ్డి మాట్లాడ లేదు. ఆలమట్టి డ్యాం ఎత్తు పెంచితే తెలంగాణ ఎడారిగా మారుద్దని కనీసం బుద్ధి రేవంత్ రెడ్డికి లేదు. రాహుల్ గాంధీతో కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక ఫోన్ కూడా చేపించలేకపోతున్నాడు రేవంత్ రెడ్డి. రేవంత్ రెడ్డి ఢిల్లీకి బ్యాగులు మోయడం ఒక్కటే పని కాదు.. తెలంగాణ బాగోగుల గురించి కూడా పట్టించుకో అని హరీష్ రావు సూచించారు. ఏపీ 463 టీఎంసీల నీళ్లు మళ్లిస్తే నేను మీద 112 టీఎంసీలు ఆపుకుంటా అని కర్ణాటక అంటుంది.. నేను 74 టీఎంసీలు ఆపుకుంటా అని మహారాష్ట్ర అంటుంది. 112 టీఎంసీలు కర్ణాటక, 74 టీఎంసీలు మహారాష్ట్ర ఆపితే మన పరిస్థితి ఏంది. మాట్లాడితే నల్లమల బిడ్డ అంటాడు.. ఆ నల్లమలను అనుకొని పారే కృష్ణా నదిలో ఆ మహబూబ్ నగర్ జిల్లాకు నష్టం జరిగితే ఎందుకు మాట్లాడటం లేదు. నువ్వు నల్లమల పులివా, పిల్లివా, ఎలుకవా.. ఎందుకు మాట్లాడటం లేదు. పులి అయితే మాట్లాడేవాడివి.. పిల్లివి, ఎలుకవు కాబట్టి మాట్లాడటం లేదు అని హరీశ్‌రావు ఘాటుగా విమర్శించారు.

## బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టుకు వెళ్లనున్న

# తెలంగాణ ప్రభుత్వం!



హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్‌ల జీవోను, ఎన్నికల నోటిఫికేషన్ అమలును నిలిపివేస్తూ హైకోర్టు ఇచ్చిన స్టేపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. దీనిపై స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. హైకోర్టు ఇచ్చిన స్టేను ఎత్తివేసి ఎన్నికల నిర్వహణకు అనుమతించాలని కోరనుంది. ఎన్నికల ప్రక్రియ, నామినేషన్ల స్వీకరణ కూడా ప్రారంభమైనందున ఇందులో హైకోర్టు జోక్యం సరికాదని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో వాదించనుంది. జీవో 9ను అమలు చేయాలని కోరనుంది. సుప్రీంకోర్టుకు వెళ్లే అంశంపై కాంగ్రెస్ నేతలు జూమ్ సమావేశం నిర్వహించారు. సుప్రీంకోర్టు న్యాయవాది అభిషేక్ సింఘ్వీతో మాట్లాడారు.

# ఐపిఎస్ అధికారి ఆత్మహత్యపై సిఎం దిగ్భ్రాంతి

## కులం దురహంకారానికి నిదర్శనమన్న రేవంత్

**హైదరాబాద్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హర్యానా కేడర్ ఐపీఎస్ అధికారి, ఏడీజీపీ వై పూరన్ సింగ్ ఆత్మహత్య చేసుకోవడం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అణగారిన వర్గాలకు వ్యతిరేకంగా జరిగిన ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. కులం కారణంగా బలవంతంగా ఆత్మహత్య చేసుకున్న ఘటనకు ఈ ఐపీఎస్ అధికారి మృతి ఒక ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు. అడిషనల్ డీజీపీ స్థాయి అధికారిని కులం పేరుతో వేధించడం చూస్తే.. సామాన్య ప్రజల దయనీయ జీవన పరిస్థితులను అర్థం చేసుకో వచ్చునన్నారు. ఇలాంటి అసహనకర సంఘటన చోటు చేసుకోవడం తీవ్ర ఆందోళనకరమని విచారం వ్యక్తం చేశారు.

# నా శాఖలో పొంగులేటి పెత్తనం..

## మంత్రి కొండా సురేఖ ఫిర్యాదు



**హైదరాబాద్:** తన శాఖలో, వరంగల్ జిల్లా రాజకీయాల్లో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పెత్తనం చేస్తున్నారని, ఆయన జోక్యం మితిమీరుతోందని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ఆమె భర్త కొండా మురళి శనివారం కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారని మంత్రి పీఆర్ఓ మీడియాకు ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే కార్యాలయానికి వారు నేరుగా ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ములుగు జిల్లా మేడారంలో చేపడుతున్న అభివృద్ధి పనుల టెండర్లలో పొంగులేటి జోక్యం చేసుకున్నారని ఫిర్యాదు చేసినట్లు ఆయన వివరించారు. పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌కు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

తెలుగు దినపత్రిక https://aksharagalam.com
అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం



## తెలంగాణ రౌండప్

# విద్యుత్ షాక్ తో ఆవు మృతి



**వెల్దండ అక్టోబర్ 11(అక్షర గళం)** వెల్దండ మండల పరిధిలోని అల్లంతోట బావి తండాకు చెందిన ఇస్లావత్ జైపాల్ నాయక్ కు చెందిన పాడి ఆవు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ గురై శనివారం సాయంత్రం మృతి చెందింది. బాధితుడి వివరాల ప్రకారం వ్యవసాయ పొలంలో పశువులను మేపుతున్నాడు గడ్డి మేస్తూ వెళ్లిన ఆవు పొలంలో ఉన్న ట్రాన్స్ ఫార్మర్ వద్దవిద్యుత్ షాక్ కు గురై అక్కడి కక్కడే ఆవు మృతి చెందింది. ఆవు విలువ రూ. 1లక్ష 20వేలు ఉంటుందని రైతు జైపాల్ నాయక్ తెలిపారు. ప్రభుత్వం పరంగా నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతు జైపాల్ నాయక్ కోరారు.

# బీజేపీ ఓట్ల చోరీని గ్రామాల్లో వివరించండి

## ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**ఆమనగల్లు, అక్టోబర్ 11 (అక్షర గళం):** బీజేపీ అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఎన్నికల సంఘం అధికారులతో కుమ్మకై ఓట్ల చోరీతో చేస్తున్న మోసాలను కాంగ్రెస్ శ్రేణులు గ్రామాలకు తీసుకెళ్లి ప్రజల్ని చైతన్య పరచాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆమనగల్లు మండలం కొత్తకుంట గ్రామ పంచాయతీ పరిధిలోని పాపర్లబోడు తండాకు చెందిన బీజేపీ పార్టీ నాయకులు శనివారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో కేతావత్ రాజు, కేతావత్ కుమార్, గోపి 10 మంది తదితర నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే నారాయణరెడ్డి, టీపీసీసీ సభ్యులు అయిల్ల శ్రీనివాస్ గౌడ్ వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు సైనికులుగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలుపుకు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, రమణ రెడ్డి, అంజన్ రెడ్డి, బలరాం, భగవాన్ రెడ్డి, జగ్గురాం, కృష్ణారెడ్డి, కిషన్, లక్ష్మణ్, శేఖర్ గౌడ్, జంగయ్య, బుచ్చిరెడ్డి, జంగయ్య, వెంకటేష్, లాలు, వెంకటేష్, దేవుళ్ళ ప్రకాష్, రాములు, హిరా సింగ్ తదితరులు ఉన్నారు.

# జమ్మిగడ్డలో రూ.12 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలం కబ్జా చెర నుంచి విముక్తి

## మీడియా ముసుగులో విజయ్ దందా...

## స్వాధీనం చేసుకున్న కాప్రా తహసిల్దార్ సుచరిత

## స్థలానికి బౌండరీ, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం




**కుషాయిగూడ, అక్టోబర్ 11, (అక్షర గళం) :** జమ్మిగడ్డలోని సర్వే నెంబర్లు 1991 376 లలో సుమారు 12 గుంటల ప్రభుత్వ భూమిని శుక్రవారం కాప్రా తహసిల్దార్ సుచరిత కబ్జా చెరనుంచి స్వాధీనం చేసుకున్నారు. స్థలానికి తక్షణమే ఫెన్సింగ్ వేయాలని రెవిన్యూ సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ స్థలంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి జిపిఎస్ సహాయంతో నిరంతరం పర్యవేక్షిస్తామని ఆమె స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఇది ప్రభుత్వ స్థలం అని పేర్కొంటూ సదరు స్థలంలో బోర్డులు నాటారు. సర్వేయర్ తో కొలతలు తీయించి మార్కింగ్ చేశారు. శనివారం స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. స్వాధీనం చేసుకున్న స్థలాన్ని ప్రజా అవసరాల కోసం ఉపయోగిస్తామని ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న భవనాలకు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. 24 గంటల్లో నూతనంగా నిర్మిస్తున్న ఇళ్లను స్వాధీనం చేసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ భూముల విషయంలో కఠినంగా వ్యవహరించి స్వాధీనం చేసుకున్న తహసిల్దార్ సుచరితను సమాచార హక్కు సాధన సమితి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కన్వీనర్ గగన్ కుమార్ అభినందించారు. ఈ భూములను భవిష్యత్తులో ప్రజా అవసరాలకు ఉపయోగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాప్రా డిప్యూటీ తహసిల్దార్ ప్రవీణ్ కుమార్ సర్వేయర్ మహేందర్ రెవెన్యూ



ఇన్ స్పెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### మీడియా ముసుగులో విజయ్ దందా...

మీడియా ముసుగులో విజయ్ అనే వ్యక్తి అధికారులను తప్పుదోవ పట్టించి ప్రభుత్వ స్థలాన్ని పప్పు బెల్లాల దోచుకుతింటున్నట్లు స్పష్టమైంది. సదరు ప్రభుత్వ స్థలానికి చుట్టూ ప్రహరీ నిర్మించి లోపల గృహాలను నిర్మిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. నూతనంగా నిర్మించిన గృహాలను సైతం స్వాధీనం చేసుకుంటామని తహసిల్దార్ సుచరిత స్పష్టం చేశారు. గతంలో ఈనాడు దినపత్రికలో, ప్రస్తుతం దిశ దినపత్రికలో విలేకరిగా కొనసాగుతూ ప్రభుత్వ భూములను కబ్జా చేసి గృహాలను నిర్మించి అమ్ముకుంటున్నాడని అధికారులు గుర్తించారు. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే ఎంతటి వారైనా చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని తహసిల్దార్ హెచ్చరించారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, వైస్ చైర్మన్ మొహమ్మద్ షాహిద్..






**కల్వకుర్తి, అక్టోబర్ 11(అక్షరగళం):** కల్వకుర్తి పట్టణానికి చెందిన ఆర్టీవో ఏజెంట్ కొండపల్లి రాములు కొట్ర ఫంక్షన్ హాల్లో శనివారం జరిగిన వివాహ వేడుకల్లో హాజరైన కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ మాజీ వైస్ చైర్మన్ మొహమ్మద్ షాహిద్ మాజీ కౌన్సిలర్ సైదులు గౌడ్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వ దించారు. ఈ కార్యక్రమంలో బేడా బుడగ జంగం సంఘం అధ్యక్షుడు కళ్యాణం వెంక టయ్య ఇందిరానగర్ కాలనీకి చెందిన యువకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మోసాలను ఎండగట్టండి

## మాజీ మంత్రి హరీష్ రావు.. ● హరీష్ రావును కలిసిన అర్జున్ రావు



**ఆమనగల్లు, అక్టోబర్ 11 (అక్షర గళం):** ప్రతి ఇంటికీ వెళ్లి కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరించాలని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ఆమనగల్లు మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పొనుగోటి అర్జున్ రావు కు సూచించారు. శనివారం హైదరాబాదులో వివాహ వేడుకలకు హాజరైన హరీష్ రావును పొనుగోటి భవాని అర్జున్ రావు, రోహిత్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని సూచించారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఓట్లు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు గెలుపే లక్ష్యంగా సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ఎకరానికి రూ. 15 వేలు, మహిళలకు రూ. 2,500, వృద్ధులు, వితంతువులకు రూ. 4 వేలు, దివ్యాంగులకు రూ. 6 వేలు ఇవ్వలేదన్నారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల జాడేలేదన్నారు. తులం బంగారం ఏమయ్యిందో ప్రజలకు చెప్పాలన్నారు. ఆరు గ్యారంటీల అమలులో ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ తప్పిదాలను బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు ప్రచారం చేయాలన్నారు.

# యువత స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

## యువ నాయకుడు రమేష్

**ఆమనగల్లు, అక్టోబర్ 11 (అక్షర గళం):** ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా యువత స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలని బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు ఏనుమల్ల రమేష్ అన్నారు. యువత ఒకరిపై ఆధారపడకుండా స్వయంకృషితో ఎదిగినప్పుడే దేశం అభివృద్ధిలో పయనిస్తుందని తెలిపారు. ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగాలు రాలేదని నిరాశ చెందకుండా తమలో ఉన్న ప్రతిభను వెలికి తీసి స్వయంకృషితో ఎదగాలని అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలో తెల్గమల్ల మహేష్ నూతనంగా ఏర్పాటు చేసిన ఎమ్ఐ ఫోటో స్టూడియోను రమేష్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఎవరి మీద ఆధారపడకుండా స్వయంకృషితో వ్యాపారం ప్రారంభించిన సందర్భంగా మహేష్ ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాగిళ్ళ లక్ష్మణ్, అబ్దుల్ కలీమ్, కామల్ల శివ, కాలే శివ, కామల్ల ప్రకాష్, లండన్ శేఖర్, భాస్కర్, రాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# యువత రాజకీయాల్లోకి రావాలి

## - తల్లోజు ఆచారి



**ఆమనగల్లు, అక్టోబర్ 11 (అక్షర గళం):** యువకులు రాజకీయంగా ముందుకు వచ్చి గ్రామాల అభివృద్ధి జరిగేలా చూడాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని బిజెపి కార్యాలయంలో కడ్తాల్ మండలం ముద్విన్ గ్రామానికి చెందిన 20 మంది కాంగ్రెస్ నాయకులు పట్టణ అధ్యక్షుడు మహేష్ ఆధ్వర్యంలో బిజెపి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కండె హరిప్రసాద్ లు వారిని బిజెపి కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. అనంతరం ఆచారి మాట్లాడుతూ.. బీజేపీ సాధిస్తున్న పురోగతి, జాతీయవాద సిద్ధాంతం నచ్చి ప్రధాని మోదీ నాయకత్వానికి ఆకర్షితులై పేద, బడుగు, బలహీన వర్గాల కోసం ఆయన చేస్తున్న సేవలు ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను గుర్తించి పార్టీలోకి విచ్చేస్తున్నారని తెలిపారు. అధికారంలోకి రావడం కోసం కాంగ్రెస్ అడ్డగోలు హామీలు ఇచ్చిందని మండిపడ్డారు. ప్ర తిపక్షాలు ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని ఆరోపించారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలపై నిలదీయాలని ఆచారి పేర్కొన్నారు.

# బాలికలు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

## - టీపీసీసీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్

**ఆమనగల్లు, అక్టోబర్ 11 (అక్షర గళం):** విద్యార్థి దశ నుండే బాగా చదివి బాలికలు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని టీపీసీసీ సభ్యులు అయిల్ల శ్రీనివాస్ గౌడ్ ఆకాంక్షించారు. అంతర్జా తీయ బాలికల దినోత్సవ వేడుకలు శనివారం కడ్తాల్ పట్టణ కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు టీపీసీసీ సభ్యులు అయిల్ల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నా రు. పాఠశాల విద్యార్థినీలతో కలిసి కేక్ కటింగ్ చేసి తినిపించారు. ఈ సందర్భంగా వారికి అంతర్జాతీయ బాలికల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బాలికల కు కల్పిస్తున్న హక్కులను తెలుసుకొని సమాజంలో వారు అభివృద్ధి చెంది ఉన్నత స్థానాలకు చేరాలన్నారు. బాలికలు విద్యతో పాటుగా క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాలు, కళలలో ప్రావీణ్యం సాధించేం దుకు సాధన చేయాలన్నారు. ఆడపిల్లలపై ఉండే వివక్షత, హింస, బాల్య వివాహాల వలన కలిగే నష్టాలపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. సమ సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర గొప్పదని అన్నారు. బాలికలు స్వయం సమృద్ధి సాధించాలని, గతంలో వంటింటికే పరిమితమైన మహిళలు నేడు పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో రాణిస్తుం డడం హర్షణీయమని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆడపిల్ల ల కోసం అనేక చట్టాలను



తీసుకువచ్చాయని, ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బిచ్య నాయక్, చేగురి వెంకటేష్ మరియు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



**ఆమనగల్లు, అక్టోబర్ 11 (అక్షర గళం):** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎంఈఓ చాంప్లా నాయక్ అన్నారు. శనివారం తలకొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జోనల్ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఆమనగల్లు పట్టణానికి చెందిన వివేక విద్యా భారతి పాఠశాల చెందిన విద్యార్థులు అండర్ 14, అండర్ 17 మరియు కబడ్డీ విభాగంలో ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను మరియు ఉపాధ్యాయులను పీఈటీ లను ఎంఈఓ చాంప్లా నాయక్ అభినందించి మాట్లాడారు.. విద్యార్థులు క్రీడల్లో పాల్గొని పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. విద్యార్థులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపాలని, ఇందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహాయసహకారాలు అందిస్తుందని వివరించారు. కార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకుడు పాపిశెట్టి రాము, మాజీ ఉపసర్పంచ్ పద్మ అనిల్, వివేక విద్యా భారతి ప్రిన్సిపల్ మహమూద్, కరస్పాండెంట్ గోలీ శ్రీనివాసులు మరియు ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## చేపలను మింగుతున్న కాలుష్యం!

పరిశ్రమల కాలుష్యం నదులను, చెరువులను, చివరకు సముద్రాన్ని కూడా కలుషితం చేస్తోంది. మన జీవితాలు ఏమయితేనేమి అన్న ధోరణిలో పరిశ్రమల యజమానులు కాలుష్యాన్ని విచ్చలవిడిగా వెదజల్లుతున్నారు. ఒకప్పుడు పటాన్ చెరువు కాలుష్యంపై ఏళ్లుగా పోరాటాలు జరిగాయి. తరవాత ఎల్‌బినగర్ సిరిస్ కంపెనీ కాలుష్యంపైనా పోరాటాలు సాగాయి. హుస్సేన్ సాగర్ కాలుష్యం అలాగే ఉండిపోయింది. కొబ్బరినీళ్లలా హుస్సేన్ సాగర్ నీళ్లను చేస్తానన్న కెసిఆర్ కూడా పట్టించుకోలేదు. ఢిల్లీ కాలుష్యంపై సుప్రీంకోర్టు గట్టిగానే హెచ్చరించినా అడుగులు పడడం లేదు. ఇప్పుడు ఉప్పాడ కాలుష్యం పై మత్స్యకారులు పోరాటం చేస్తున్నారు. దీనిపై డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ గట్టిగానే స్పందించారు. అయితే ఆయన పట్టుదల ఎంతవరకు అన్నది తేలాల్సి ఉంది. పట్టుదలతో కాలుష్యాన్ని అరికట్టగలిగితే చిరస్థాయిగా నిలిచిపోతారు. సముద్రాన్ని కాపాడుకున్నవారం అవుతాం. అలాగే విశాఖలో సముద్రజలాల కాలుష్యం కూడా ఇంతకుమించి ఉంది. వీటిపై ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. కాకినాడ జిల్లాలో ఉన్న పారిశ్రామిక కాలుష్యం, మైనింగ్ మూలంగా తలెత్తుతున్న కాలుష్య ఇబ్బందులపై కాలుష్య నియతం÷–రణ అధికారులతో పవన్ కళ్యాణ్ చర్చించారు. కాకినాడలో చేపట్టిన మత్స్యకారులతో మాట..మంతిలో మత్స్యకారులు ప్రస్తావించిన అంశాలు, వారి సందేహాలపై పీసీబీ నుంచి వివరాలు తీసుకున్నారు. పొల్యూషన్ ఆడిట్‌కి అనుసరించాల్సిన విధివిధానాలపై చర్చించారు. కాకినాడ జిల్లాతోపాటు గోదావరి జిల్లాల్లో ఉన్న కాలుష్య పరిస్థితులు, పర్యావరణ పరిరక్షణపై వివరాలు అడిగి పవన్ కళ్యాణ్ తెలుసు కున్నారు. దీనిపై ఎలాంటి అడుగులు వేస్తారన్నది ఇప్పుడు అందరి దృష్టి ఉంది. నిజానికి ఉప్పాడ తీరంలో ఉంటున్న వారంతా సముద్రాన్నే నమ్ముకుని చేపల వేట ద్వారా కుటుంబాలను పోషించుకుంటున్న మత్స్యకారులు. ఏళ్ల తరబడి వేటే ఆధారంగా జీవిస్తున్నారు. వీరి ఉపాధికి ఫార్మా కంపెనీలు గండి కొడుతున్నాయి. ఈ పరిశ్రమల వ్యర్థాలను సముద్రంలోకి విడిచిపెడుతుండడంతో చేపల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడుతోంది. కాకినాడ జిల్లా కెఎస్‌ఇజడ్ పరిధిలో లైఫిజ్, అరబిందో ఫార్మా కంపెనీల నుంచి వచ్చే వ్యర్థాలను సముద్రంలోకి విడిచిపెట్టేందుకు యు.కొత్తపల్లి మండలంలో కోనపాపపేట, తొండంగి మండలం పెరుమల్లపురం మధ్యలో మూడు కిలోమీటర్ల పొడవున భారీ పైపు లైన్‌ను రెండేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. దీనిద్వారా ఫార్మా వ్యర్థాలు, విషపూరిత జలాలను శుద్ధి చేయకుండా సముద్రంలోకి నేరుగా విడుదల చేస్తున్నారు. అరబిందో పరిశ్రమ నుంచి కూడా భారీ పైపులైను ద్వారా వ్యర్థాలను సముద్రంలోకి విడిచి పెడుతున్నారు. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం చేపల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. నిర్వహణ ఖర్చులు కూడా రాని పరిస్థితి ఏర్పడింది. ఫార్మా కంపెనీలు, తీర ప్రాంతానికి ఆనుకుని ఉన్న హేచరీల ద్వారా రసాయనిక జలాలు, ఇతర వ్యర్థాలు సముద్రంలోకి వదిలేస్తున్నారు. దీనివల్ల చేపలు దూరంగా వెళ్లిపోయాయి. కొన్ని చేపలు చనిపోతున్నాయి. పరిశ్రమల కాలుష్యంపై వైసిపి హయాం నుంచీ పోరాటం చేస్తున్నారు.. ఎవరూ పట్టించుకోవట్లేదు. ప్రభుత్వం మారిన తర్వాతైనా న్యాయం జరుగుతుందని ఆశించారు. వ్యర్థాలను శుద్ధి చేసిన తర్వాతే వ్యర్థాలను సముద్రంలోకి వదలాలని కోరుతున్నారు. యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ నుంచి తొండంగి మండలం అద్దారిపేట వరకు సుమారు 32 కిలోమీటర్ల మేర తీర ప్రాంతం ఉంది. ఈ రెండు మండలాల్లో 18 గ్రామాలకు చెందిన దాదాపు 50 వేల మంది మత్స్యకారులు చేపల వేటే ఆధారంగా జీవనం సాగిస్తున్నారు. ఫార్మా కంపెనీల వ్యర్థాల వల్ల చేపలు చనిపోతున్నాయని వారు ఆందోళన చెందుతున్నారు. మూడేళ్ల నుంచి చేపల ఉత్పత్తి తగ్గిపోయిం దని

మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో చిన్నబోటుపై వేటకు వెళ్తే రోజుకు రూ.5 వేల నుంచి రూ.8 వేల విలువైన మత్స్య సంపద దొరికేదని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని చెబుతున్నారు. ఒక్కసారి వేటకు వెళ్తే చిన్నబోటుకు రూ.2 వేలు, పెద్ద బోటుకు రూ.25 వేల నుంచి రూ.30వేల వరకూ ఆయిల్‌కు ఖర్చవుతుందని తెలిపారు. పెద్ద బోట్లలో 12 మంది వరకూ వేటకు వెళ్తారని, 15 రోజుల వరకూ సముద్రం లోనే ఉండాల్సి ఉంటుందన్నారు. ఆయిల్, ఐస్, ఇతర నిర్వహణకు మొత్తంగా రూ.1.50 లక్షల వరకూ ఖర్చు అవుతుందని తెలిపారు. ఖర్చులుపోనూ గతంలో రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ ఆదాయం సమకూరేదని, ప్రస్తుతం చేపలు దొరక్కపోవడంతో ఖర్చులు కూడా రావట్లేదని ఉప్పాడ మత్స్యకారులు తెలిపారు.గత జగన్ ప్రభుత్వ హయాం నుంచి ఈ సమస్యల పరిష్కారం కోసం మత్స్యకారులు ఆందోళనలు సాగిస్తున్నారు. మత్స్యకారులు గతేడాది ఏప్రిల్‌లో పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. బీచ్ రోడ్డుని పూర్తిగా నిర్బంధించి పది రోజులపాటు నిరసన గళాన్ని వినిపించారు. ఎన్నికల కోడ్‌తో ఆందోళన విరమించారు. ఎన్నికల సమయంలో ఉప్పాడలో నిర్వహించిన బహిరంగ సభలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మాట్లాడారు. కాలుష్య పరిశ్రమలను నిలిపేస్తామని హామీ ఇచ్చారు. ఆయన డిప్యూటీ సిఎం అయినప్పటికీ హామీ అమలు కాలేదు. దీంతో, మత్స్యకారులు మళ్లీ ఆందోళనబాట పట్టారు. వేల సంఖ్యలో ఉప్పాడ సెంటర్‌లో నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో పవన్ కళ్యాణ్ స్పందించి ఇటీవలే వారితో చర్చించి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సమస్య పరిష్కారానికి వంద రోజుల సమయం కావాలని కోరారు. న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ హామీ ఎంతవరకు అమలవుతుందో చూడాలి. అయితే వెంటనే అధికారులతో సమస్యపై చర్చించడంతో కొంత ఆశ చిగురిస్తోంది.

## దగ్గుమందుపై తమిళనాడు సర్కార్ నిర్లక్ష్యం

**న్యూఢిల్లీ:** రాష్ట్ర ఔషధ నియంత్రణ సంస్థ నిబంధనలను విస్మరించిందని, కేంద్రం చేసిన సిఫార్సులకు అనుగుణంగా చర్యలు తీసుకోవడంలో విఫలమైందని గుర్తించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. దగ్గుమందు తయారీ విషయంలో సరైన పర్యవేక్షణ లేదని, సకాలంలో చర్యలు తీసుకోక పోవడంతో విషపూరితమైన సిరప్ మార్కెట్లోకి ప్రవేశించిందని పేర్కొన్నాయి. దగ్గుమందు మరణాలకు తమిళనాడు అధికారుల నిర్లక్ష్యమే కారణమని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ కంపెనీని ఇప్పటివరకు వారు ఒక్కసారి కూడా తనిఖీ చేయలేదన్నాయి. దర్యాప్తులో భాగంగా కేంద్ర ఔషధ నియంత్రణ సంస్థ పలు వైఫల్యాలను గుర్తించినట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. 'కోల్డ్‌రిఫ్' దగ్గు మందు వల్ల మధ్యప్రదేశ్‌లో 20 మందికి పైగా చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ దగ్గుమందును తమిళనాడులోని కాంచీపురానికి చెందిన శ్రేసన్ ఫార్మా యూనిట్ తయారుచేసింది. మరణాల నేపథ్యంలో ఈ కంపెనీలో తనిఖీ చేయగా.. సిరప్‌లో 48.6 శాతం డైఇథైలిన్ ÷–లగైకాల్ ఉందని తేలింది. ఇది అత్యంత విషపూరితమైనదిగా అధికారులు పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కేంద్ర ఔషధ నియంత్రణ సంస్థ తన దర్యాప్తులో పలు లోపాలను గుర్తించినట్లు సమాచారం. ఆ నిర్లక్ష్యం పిల్లల మరణాలకు దారితీసిందని తెలిపాయి. ఆ ఫార్మా సంస్థలో ఏ ప్రభుత్వ ఏజెన్సీ ఆడిట్ నిర్వహించ లేదని తెలుస్తోంది. అలాగే ఔషధ తయారీ సంస్థగా ఈ కంపెనీ కేంద్ర పోర్టల్‌లో రిజిస్టర్ కాలేదని గుర్తించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చే గుడ్ మాన్యుఫాక్చరింగ్ ప్రాక్టీస్ సర్టిఫికేట్ లేకుండానే దశాబ్దాల పాటు ఫార్మా సంస్థ నడిచేందుకు తమిళనాడు ప్రభుత్వం అనుమతివ్వడాన్ని దర్యాప్తు సంస్థ ప్రశ్నించింది. విచారణలో భాగంగా కేంద్ర బృందానికి రాష్ట్ర అధికారులు సహకరించడం లేదని, ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని ఆరోపించింది. కాగా, డ్రగ్స్ తయారీ యూనిట్లను తనిఖీ చేయడంలో కేంద్రం విఫలమైందని ఇప్పటికే తమిళనాడు విమర్శించింది. ఈ అంశంపై తమిళనాడు ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణియన్ మాట్లాడుతూ.. మరింత హాని జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుందని చెప్పారు. ఇక, కంపెనీ యజమానిని రెండు రోజుల క్రితం అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

## రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యులు చారగొండ వెంకటేష్ కలిసిన వెల్జాల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు



**కల్వకుర్తి, అక్టోబర్ 11(అక్షరగళం):**రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యులు డాక్టర్ చారగొండ వెంకటేశ్ ను మరియు టీ షాట్ సిఈఓ , బి.వేణుగోపాల్ రెడ్డి లను శనివారం హైదరాబాద్ లో వారి చాంబర్లలో కలిసి గ్రామం లోని పాటశాలలో ఉన్న సమస్యలు వివరించి ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థిని విద్యార్థుల భవిష్యత్తు కోసం వారి గ్రామానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు చేసి పాఠశాల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయించాలని కోరారు.ఈ సందర్భంగా విద్యా కమిషన్ సభ్యులు వెంకటేష్ మాట్లాడుతూ త్వరలోనే మీ గ్రామానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు చేసి మరొకసారి పాఠశాలను సందర్శిస్తానని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ చెర్ల వెంకటరెడ్డి మాజీ ఎంపీటీసీలు జి శ్రీనివాసమూర్తి , ఎం .అంబాజీ, మాజీ సింగల్ విండో చైర్మన్ ఏ అంజయ్య గౌడ్, మాజీ ఉప సర్పంచ్ లు బి నర్సింలు , ఎం. ఏ.అజీజ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పి అశోక్ బాబు ఏ వెంకట్ రెడ్డి మండల కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి ఆరిఫ్, నాయకులు టి కృష్ణయ్య గౌడ్, ఏ.కిరణ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



## డిసిసి నియామకం కోసం బయోడేటాను పరిశీలించిన జిల్లా అబ్జర్వర్ అంజలి నిమ్బల్కర్

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 11, (అక్షర గళం) : నూతన డిసిసి అధ్యక్షుల నియామకం కొరకు ఏఐసీసీ నియమించిన జిల్లా అబ్జర్వర్ అంజలి నిమ్బల్కర్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కి విచ్చేశారు. ఈ సందర్భంగా మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి జిల్లా అబ్జర్వర్ అంజలి నిమ్బల్కర్ కి స్వాగతం పలికారు. అనంతరం జిల్లా పార్టీ కార్యాలయంలో డిసిసి నియామకం కోసం బయోడేటాను పరిశీలనకు తీసుకొని, జిల్లా ముఖ్య నాయకులతో ముఖాముఖి కార్యక్రమాన్ని అంజలి నిమ్బల్కర్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిసిసి ఆర్గనైజర్లు, తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఖైరతాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ పి. విజయ రెడ్డి, మల్కాజిగిరి నియోజకవర్గం ఇంచార్జ్ మైనంపల్లి హనుమంత్ రావు, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఇంచార్జ్ కోలన్ హనుమంత్ రెడ్డి, ఉప్పల్ నియోజకవర్గం ఇంచార్జ్ ఎం. పరమేశ్వర్ రెడ్డి, కూకట్పల్లి నియోజకవర్గం ఇంచార్జ్ బండి రమేష్, మాజీ శాసన సభ్యులు కూన శ్రీశైలం గౌడ్, మలిపెద్ది సుధీర్ రెడ్డి, టీపీసీసీ స్పోక్స్ పర్సన్ సత్యం శ్రీరంగం, టిపిసిసి జనరల్ సెక్రెటరీ పీసరి మైపాల్ రెడ్డి తో కలిసి మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సారెడ్డి భూపతి రెడ్డి పాల్గొన్నారు.

# ఓటు చోరీతో ప్రజాస్వామ్యం ఖూనీ

### ఓటు చోరీతో ప్రజాస్వామ్యం ఖూనీ





**ఆమనగల్లు, అక్టోబర్ 11 (అక్షర గళం):** ఒకే ఇంటి నంబర్ పై పదుల సంఖ్యలో ఓటర్లుగా నమోదు చేసుకుంటూ కొందరు ఓటు చోరీకి పాల్పడుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని సిడబ్ల్యూసి ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్ రెడ్డి ఆరోపించారు. ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు శనివారం కడ్తాల్ పట్టణ కేంద్రంలో మండల అధ్యక్షుడు బిచ్యానాయక్ ఆధ్వర్యంలో ఓటు చోరీపై సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వంశీచంద్ రెడ్డి ఓటు చోరీకి వ్యతిరేకంగా సంతకం చేసి టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి భిక్య నాయక్లతో కలిసి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఓటు చోరీ చేయడమంటే దేశ పౌరుల హక్కులను దొంగలిస్తూ ప్రజాస్వామ్యం దగా చేయడమే అన్నారు. రాజ్యాంగాన్ని దెబ్బతీసేందుకు బీజేపీ ప్రయత్నం చేస్తుందని, మహారాష్ట్ర, కర్ణాటకలో ఓటు చోరీ జరిగిందని కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ ఆధారాలతో సహా నిరూపించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీని లక్ష్యంగా చేసుకొని కొన్ని రాష్ట్రాల్లో ఓట్లను అక్రమంగా తొలగిస్తున్నారని ఆరోపించారు. ఉద్దేశపూర్వకంగా ఓట్ల తొలగింపును కొందరు ప్రైవేట్ వ్యక్తులు చేస్తున్నట్లు బహిర్గతం కావడం ఆందోళన కలిగిస్తుందని తెలిపారు. ప్రతి గ్రామం, వార్డుల్లో ప్రజలు సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యేలా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో చేగురు వెంకటేశ్, రాములు, అంజయ్య, గుజ్జల మహేష్, యాదయ్య గౌడ్, లక్ష్మయ్య, బిక్షపతి, యాదగిరి రెడ్డి, జహంగీర్ అలీ, జహంగీర్ బాబా, షాబుద్దీన్, సత్యం, మల్లేష్ గౌడ్, రాము నాయక్, ఆనంద నాయక్, బాల్రాజ్, చెన్నయ్య, క్యామ శేఖర్, శంకర్, రామకృష్ణ, సిలారి, శ్రీశైలం,మల్లయ్య రాజేష్, జవహర్లాల్,తులసి రాం, నరసింహ, యాదయ్య చెన్నయ్య హరి, ఫరీద్ అనిల్ కుమార్ లక్పతి నాయక్, ఇమ్రాన్ బాబా, అజ్గర్ అలీ, మల్లయ్య, బలరాం నాయక్, కృష్ణా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## భగవాన్ శ్రీ సత్య సాయి ఆశీస్సులతో కల్వకుర్తి ప్రాంతం సుభిక్షంగా ఉండాలి..

**కల్వకుర్తి నియోజకవర్గ విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తా..**

**సత్య సాయి సెంట్రల్ మేనేజింగ్ ట్రస్ట్ పుట్టపర్తి ఆర్జే రత్నాకర్..**

**ముగిసిన సత్య సాయి విగ్రహాల ప్రతిష్ట మహోత్సవం..**



కల్వకుర్తి, అక్టోబర్ 11(అక్షరగళం):కల్వకుర్తి సత్య సాయి బాబా ఆశీస్సులతో కల్వకుర్తి ప్రాంతం సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆకాంక్షించారు. పట్టణంలో సుమారు ఏడు కోట్ల వ్యయంతో అట్టహాసంగా నిర్మించిన సత్యసాయి మందిరం, విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న శ్రీ సత్య సాయి సెంట్రల్ మేనేజింగ్ ట్రస్ట్ పుట్టపర్తి ఆర్జె రత్నాకర్ లతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సత్యసాయి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ మరో పుట్టపర్తి నిలయంగా కల్వకుర్తి ప్రాంతంలో నిర్మించడం శుభపరిణామం అని పేర్కొన్నారు. సత్య సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరగా వెంటనే స్పందించిన ఆర్జే రత్నాకర్ సత్యసాయి ఆశీస్సులతో తప్పనిసరిగా విద్యార్థికి ఏర్పాటు అందిస్తామని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తో పాటు ప్రపంచవ్యాప్తంగా ఎంతోమందికి సేవలు అందించామని అన్నారు. భగవంతు శ్రీ సత్య సాయి ఆశీస్సులతో సామాజిక సేవ కార్యక్రమాలు ఇప్పటికీ కొనసాగుతాయని తెలిపారు. సత్య సాయి ట్రస్ట్ ద్వారా సమాజం లో కుల మతాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు ముందుకు సాగుతాయని పేర్కొన్నారు. అనంతరం సత్య సాయి ట్రస్ట్ సభ్యులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి ట్రస్ట్ కన్వీనర్ గుబ్బ ఈశ్వరయ్య, గుబ్బ శంకరయ్య, గుబ్బ వెంకటేష్ తోపాటు మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, భూపతి రెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, జూలూరి రమేష్ బాబు, విజయ కుమార్ రెడ్డి, సంజీవ యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, తో పాటు పలువురు నాయకులు సత్యసాయి సేవా ట్రస్టు సభ్యులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అహ్మద్ గూడ స్మశాన వాటికను సందర్శించిన హైడ్రా అధికారులు



**కీసర, అక్టోబర్ 11,(అక్షర గళం) :**మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కీసర మండలం దమ్మాయిగూడ మున్సిపాలిటీ అహ్మద్ గూడ లో ఉన్న స్మశానవాటికను శనివారం హైడ్రా అధికారులు పరిశీలించారు. సర్వే నెం. 86, 87 లోని హిందూ స్మశాన వాటిక స్థలాన్ని మోడీ బిల్డర్స్ వారు కబ్జాచేసి ఆర్చ్(కమాన్) నిర్మించారని స్థానిక ప్రజలు, నాయకులు గతంలో హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఆదేశాల మేరకు హైడ్రా అధికారులు ఆదిత్య, పవన్ పర్యటించి, స్మశాన వాటికలో మోడీ బిల్డర్స్ వారు నిర్మించిన ఆర్చ్ స్థలాన్ని పరిశీలించారు. స్థానిక నాయకులు, ప్రజలు కబ్జా విషయాన్ని హైడ్రా అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా హైడ్రా అధికారులు మాట్లాడుతూ.. పూర్తి స్థాయి విచారణ జరిపి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నాను నాయక్, మాజి వార్డు సభ్యులు కొత్త భాస్కర్ గౌడ్,లింగాల కనకయ్య, మణిపాల్ రెడ్డి, గోవింద్ సింగ్,స్థానికులు తదితరులు పాల్గొన్నారు

## రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు వ్యతిరేకంగా ఉన్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలి..

**సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గం పర్వతాలు**



**కల్వకుర్తి, అక్టోబర్ 11(అక్షరగళం):**తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42% రిజర్వేషన్ అమలుకు వ్యతిరేకంగా ఉన్న కేంద్ర బిజెపి ప్రభుత్వం గద్దె దింపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గం పర్వతాలు అన్నారు శనివారం కల్వకుర్తి పట్టణంలో మహబూబ్నగర్ చౌరస్తా దగ్గర నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు జీవోతోపాటు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై హైకోర్టు స్టే విధించడంతో ఎన్నికల ప్రక్రియ నిలిచిపోవడానికి ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వమేనని విమర్శించింది. ఇప్పటికైనా రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు నైతిక బాధ్యత వహించి, వారి పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం కోరే శక్తులు,ప్రజాస్వామికవాదులంతా కేంద్ర ప్రభుత్వాన్ని గద్దెదింపేందుకు పోరాటాలకు సన్నద్ధం కావాలని విజ్ఞప్తి చేశారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయబద్ధమైన చర్యలన్నీ తీసుకోవాలని డిమాండ్ చేశారు.కులగణన, సర్వే నిర్వహించి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు కేంద్రానికి పంపించినా స్పందించలేదని విమర్శించారు. శాసనసభలో అన్ని పార్టీలూ ఏకగ్రీవంగా ఆమోదించి ఆర్డినెన్స్ చేసి గవర్నర్‌కు పంపించినా ఆమోదించకపోవడం వల్లే రిజర్వేషన్లు ఆగిపోయాయని తెలిపారు. బీజేపీ కులతత్వ, మనువాద పార్టీ అయినందున, కుల వ్యవస్థ, అసమానతలు ఉండాలనీ, మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని కోరుకుంటున్నదని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలకు రావాల్సిన హక్కులన్నిం టినీ కాలరాస్తున్నదని విమర్శించారు. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు కేంద్రంపై ఒత్తిడి తేవడానికి ఎటువంటి ప్రయత్నమూ చేయలేదని తెలిపారు. కేంద్రంలో అధికారంలో బీజేపీ ఉండడం వల్లే ఈ రిజర్వేషన్లు అమలు కాని పరిస్థితి ఏర్పడిరదని పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కావాలంటే రాష్ట్రంలో, కేంద్రంలో బీజేపీకి పుట్టగతులు లేకుండా చేస్తేనే సాధ్యమవుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ శ్రీనివాస్ బి ఆంజనేయులు శ్రీ ఆంజనేయులు సిపిఎం సీనియర్ నాయకులు ఏపీ మల్లయ్య సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బాలస్వామి శంకర్ నాయక్ శివవర్మ సిపిఎం జిల్లా నాయకులు నాగపూర్ మధు రాములు తదితరులు పాల్గొన్నారు



## నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి కలిసిన వెల్జాల్ కాంగ్రెస్ నాయకులు

**కల్వకుర్తి, అక్టోబర్ 11(అక్షరగళం)** రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు హైదరాబాద్ లో నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి ని శనివారం వారి నివాసంలో కలిసి వెల్జాల్ మరియు మాదాయ పల్లి గ్రామాల అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలి అని వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మల్లు రవి మాట్లాడుతూ మీరు అడిగిన రెండు గ్రామాల అభివృద్ధి కోసం త్వరలోనే నిధులు మంజూరు చేస్తానని హామీ ఇవ్వడం జరిగిందిలి. ఈ కార్యక్రమంలో వేదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ధర్మకర్త మాజీ ఎంపిటిసి జి శ్రీనివాసమూర్తి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చెర్ల వెంకట్ రెడ్డి నాగర్ కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఏ. మధుసూదన్ రెడ్డి, సింగల్ విండో మాజీ చైర్మన్ ఆయిల్ అంజయ్య గౌడ్, మాజీ ఎంపీటీసీ, మల్లి కేడీ అంబాజీ, మాజీ ఉపసర్పంచ్ లు, బి నర్సింలు ఎం ఎ.అజీజ్ సీనియర్ నాయకులు పి అశోక్ బాబు, ఏ వెంకటరెడ్డి, మండల కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి ఆరిఫ్ నాయకులు టి కృష్ణయ్య గౌడ్ , ఏ.కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ పర్యటనకు రాబోతున్న ప్రధాని నరేంద్ర మోదీ..

ఆంధ్రప్రదేశ్: పర్యటనకు రాబోతున్న ప్రధాని నరేంద్ర మోదీ .. ఫుల్ షెడ్యూల్ ఇదే ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 16న ఆంధ్రప్రదేశ్ పర్యటనకు వస్తున్న సంగతి తెలసిందే.. ప్రధాని పర్యటన ఫుల్ షెడ్యూల్ వచ్చేసింది. ఈ నెల 16న ఉదయం 7.50 కు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో ప్రధాని బయల్దేరతారు. ఉదయం 10.20 కు కర్నూలు ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి సున్నిపెంట వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు మోదీ చేరుకుంటారు. ఉదయం 11.10 కి రోడ్డుమార్గంలో శ్రీశైలం భ్రమరాంబ గెస్ట్ హౌస్‌కు చేరుకుంటారు. ఉదయం 11.45 కి భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకుంటారు. మధ్యాహ్నం 1.40కి సున్నిపెంట హెలిప్యాడ్ నుంచి నన్నూరు హెలిప్యాడ్‌కు ప్రధాని మోదీ బయల్దేరి వెళతారు. మధ్యాహ్నం 2.30 కు రాగమయూరి గ్రీన్ హిల్స్ వెంచర్‌కు ప్రధాని మోదీ శంకుస్థాపన చేస్తారు. అనంతరం సాయంత్రం 4 గంటల వరకు బహిరంగ సభలో ప్రధాని మోదీ పాల్గొంటారు. సాయంత్రం 4.15 కు రోడ్డుమార్గంలో నన్నూరు హెలిప్యాడ్‌కు చేరుకొని సాయంత్రం 4.40కు కర్నూలు ఎయిర్‌పోర్ట్‌కు చేరుకొని ఢిల్లీకి వెళతారు. సూపర్ జీఎస్టీ సూపర్ హిట్ సభలో ప్రధాని మోదీతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ ప్రసంగిస్తారు.



కర్నూలులో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొనే భారీ బహిరంగ సభను విజయవంతం చేయడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి నారా లోకేశ్ సూచించారు. ఈ నెల 16న జరగనున్న ఈ సభతో పాటు, దీపావళి సందర్భంగా 16 నుంచి 19 వరకు జిల్లా కేంద్రాల్లో గ్రాండ్ జీఎస్టీ షాపింగ్ ఫెస్టివల్స్ నిర్వహించాలని ఆయన ఆదేశించారు. జీఎస్టీ 2.0 సంస్కరణల వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించడానికి రాష్ట్రవ్యాప్తంగా 98,985 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఉండవల్లిలోని తన నివాసంలో మంత్రులు పయ్యావుల కేశవ్, సత్యకుమార్ యాదవ్, వంగలపూడి అనిత, సీఎస్ విజయానంద్, సీఎంవో ఉన్నతాధికారులతో సమావేశమైన లోకేశ్, ప్రధాని రాష్ట్ర పర్యటన ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా, జీఎస్టీ 2.0 సంస్కరణల గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు విస్తృతమైన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

సుమారు మూడు లక్షల మంది ప్రజలు హాజరయ్యే ఈ సభలో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ప్రధాని భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ సభా వేదికను నిర్మిస్తున్నారు. ఈ సభ కోసం 40 ఎకరాల విస్తీర్ణంలో ప్రధాన వేదికను, ప్రజలు సౌకర్యంగా కూర్చోవడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలిరావడానికి పదివేల బస్సులు, ఇతర వాహనాలు వస్తాయి. వాటిని నిలిపేందుకు 347 ఎకరాల్లో విశాలమైన ప్రాంగణాలను సిద్ధం చేస్తున్నారు. మంత్రి టీజీ భరత్, ప్రధాని కార్యక్రమ ప్రత్యేక అధికారి వీర పాండియన్, జిల్లా కలెక్టర్ సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మెల్యేలు కేఈ శ్యాంబాబు, దస్తగిరి, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, సీఎం కార్యక్రమ సమన్వయకర్త సత్యనారాయణరాజు తదితరులు ఈ ఏర్పాట్లను పరిశీలించారు. సభకు ప్రజల రాకపోకలకు, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రజలు సురక్షితంగా, సౌకర్యవంతంగా సభలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

# ఏడు మెగా ఫుడ్ ప్రాసెసింగ్ ప్లాంట్లు..



ఏపీ: యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం.. ఆ దిశగా చర్యలు తీసుకుంటోంది. ఏపీ ప్రభుత్వం తీసుకుంటున్న పారిశ్రామిక విధానాల కారణంగా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు ముందుకు వస్తున్నాయి. ఈ క్రమంలోనే ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ రంగం గత 15 నెలల కాలంలో భారీగా పెట్టుబడులను ఆకర్షించింది. ఏపీలో ఎన్డీఏ కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలోకి రూ.12 వేల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చినట్లు లెక్కలు చెప్తున్నాయి. ఏపీలో 12 వేల కోట్లకు పైగా పెట్టుబడులతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు పలు సంస్థలు ముందుకు వచ్చాయి. ఇందులో ప్రధానంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ కర్నూలు జిల్లాలో రూ.1700 కోట్లతో యూనిట్ ఏర్పాటు చేయనుంది.


టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కర్నూలు జిల్లాలో ఎక్కువగా ఫుడ్ ప్రాసెసింగ్ ప్లాంట్లు ఏర్పాటవుతున్నాయి. ఈ 15 నెలల కాలంలో ఏడు మెగా ఫుడ్ ప్రాసెసింగ్ ప్లాంట్లు కర్నూలులోనే ఏర్పాటు చేసేందుకు చర్యలు ప్రారంభం కావటం విశేషం. ఇటు హైదరాబాద్, అటు బెంగళూరుకు సమాన దూరంలో ఉండటం కర్నూలు జిల్లాకు కలిసి వస్తోంది. కర్నూలు నుంచి హైదరాబాద్ రోడ్డు మార్గంలో రావాలంటే మూడు గంటలు సమయం పడుతుంది. అలాగే కర్నూలు నుంచి బెంగళూరుకు రోడ్డు మార్గంలో వెళ్లాలంటే ఐదు గంటలు పడుతుంది. ఈ నేపథ్యంలో కర్నూలు జిల్లావైపు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసే సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. రోడ్డు మార్గం ద్వారా ఉత్పత్తుల రవాణా సులభంగా, వేగంగా జరపవచ్చనే ఆలోచనతో కర్నూలు వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలిసింది.

తాజాగా కర్నూలు జిల్లాలోని ఓర్వకల్‌లో సాఫ్ట్ డ్రింక్స్, పండ్ల రసాల ప్లాంట్ ఏర్పాటు చేయాలనే రిలయన్స్ ఇండస్ట్రీస్ ప్రతిపాదనను ఏపీ కేబినెట్ ఇటీవల ఆమోదించింది. ఈ ప్లాంట్‌ను దాదాపు రూ.1,700 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్నారు. దీని ద్వారా దాదాపు 1,200 మందికి ఉపాధి దొరుకుతుందని అంచనా. పశువుల దాణా, గోతాముల తయారీలో ప్రముఖ సంస్థ ఒకటి గుంటూరు, నెల్లూరు, చిత్తూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 11 యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ఈ కంపెనీ దాదాపు రూ. 450 కోట్లతో ఈ ప్లాంట్లు ఏర్పాటు చేయనుంది.

కుప్పం నియోజకవర్గంలో రూ.250 కోట్లతో మహిళా స్వయం సహాయక బృందం పాడి, పశువుల దాణా ప్లాంటును ఏర్పాటు చేస్తోంది. అలాగే కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురంలో రూ.430 కోట్లతో మదర్ డెయిరీ పండ్ల ప్రాసెసింగ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. అలాగే ఏస్ ఇంటర్నేషనల్ రూ.750 కోట్లతో కుప్పం నియోజకవర్గంలో భారీ డెయిరీని ఏర్పాటు చేస్తోంది.

ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఏపీకి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని ఏపీ పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ వెల్లడించారు. పామాయిల్ తయారీలో ప్రముఖ సంస్థ ఒకటి రూ.250 కోట్లతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రిఫైనరీ ఏర్పాటు చేయనుందని వెల్లడించారు. ఏబీఎస్ ప్రోటీన్స్ అనే సంస్థ రూ.400 కోట్లతో ఏపీలో చికెన్ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేసిందని వెల్లడించారు. ఎంఎస్ఎంఈ యూనిట్ల ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ సెక్టార్‌లోక వేయి కోట్లు పెట్టుబడులు రాబట్టినట్లు మరో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వివరించారు.

# ఉచితంగా రూ.20వేలు..



ఆంధ్రప్రదేశ్: వితంతువులను ఓ ముఠా మోసం చేస్తోంది. అసలు లేని పథకం పేరు చెప్పి రూ.2 వేలు తీసుకుని రూ.20 వేలు ఇప్పిస్తామని ఆశ చూపిస్తున్నారు. జిరాక్స్ షాపుల నిర్వాహకులు, కొందరు ఉద్యోగులు కూడా ఈ మోసంలో భాగస్వాములు అవుతున్నారు. పల్నాడు జిల్లాలో కొందరు తహసీల్దార్లు ఈ పథకం లేదని ప్రకటనలు కూడా విడుదల చేయాల్సి వచ్చింది. ఈ కేటుగాళ్లు వితంతువుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుంటున్నారు.


ఆంధ్రప్రదేశ్‌లో వితంతువులను ఓ ముఠా మోసం చేస్తోంది. అసలు అమలులో లేని పథకం పేరు చెప్పి రూ.2 వేలు ఇస్తే రూ.20 వేలు ఇప్పిస్తామని ఆశ చూపిస్తున్నారు. ఈ మోసంలో జిరాక్స్ షాపుల నిర్వాహకులు, కొందరు ఉద్యోగులు కూడా భాగస్వాములు అవుతున్నారు. రోజుకు వందల సంఖ్యలో దరఖాస్తులు వస్తుండటంతో, అసలు పథకమే లేకుంటే ఈ కాగితాలు ఎక్కడివని అధికారులు ఆందోళన చెందుతున్నారు. తాజాగా పల్నాడు జిల్లాలో కొందరు తహసీల్దార్లు ఆ పథకం లేదు అంటూ ప్రకటనలు కూడా విడుదల చేయాల్సి వచ్చింది. ఈ కేటుగాళ్లు వితంతువుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుంటున్నారు. అసలు లేని పథకం ఉందని నమ్మించి.. రూ.2వేలు తీసుకుని రూ.20వేలు ఇప్పిస్తామని చెబుతున్నారు. ఈ వలలో పడి ఎంతో మంది మహిళలు మోసపోయారు. పథకమే లేదు.. రోజుకు వందల సంఖ్యలో దరఖాస్తులు వస్తుండటంతో అధికారులు గందరగోళంలో ఉన్నారు.

భర్త చనిపోయి, ఆదరువు లేని అల్పాదాయ కుటుంబాలకు గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించిన జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (ఎన్‌ఎఫ్‌బీఎస్) నిలిచిపోయింది. అయితే దీన్ని ఇప్పుడు ఆసరాగా చేసుకుని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫోటోతో ఉన్న దరఖాస్తు ఫారాలను ఫోటోస్టాట్, ఇంటర్నెట్ సెంటర్లలో రూ.50 నుంచి రూ.100 వరకు అమ్ముతున్నారట. 2017 ఏప్రిల్ 12వ తేదీ తర్వాత భర్త చనిపోయి భార్యలకు రూ.20 వేల సాయం అందుతుందని మాయ మాటలు చెబుతున్నారట. పథకం లేదని చెప్పినా, తహసీల్దార్ కార్యాలయాల్లో ఈ పత్రాలను పెడుతున్నారని వితంతువులు, వారి తరఫున వచ్చినవారు చెబుతున్నారు. విచిత్రంగా మరణ ధ్రువపత్రం, నివాస ధ్రువపత్రం వంటి అవసరమైన పత్రాలపై సంతకాల కోసం కొందరు అదనంగా డబ్బులు తీసుకుంటున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.

ఈ పథకం కింద రూ.20 వేలు రావాలంటే.. ముందుగా రూ.2 వేలు ఇవ్వాలని దళారులు, మాయగాళ్లు డిమాండ్ చేస్తున్నారట. అంతేకాదు దరఖాస్తుల కొనుగోలుతో పాటు అప్లికేషన్ పూరించేందుకు, ఇతరాలకు వితంతువులు డబ్బులు ఇస్తున్నారట. అయితే రాష్ట్రంలో అసలు ఎన్‌ఎఫ్‌బీఎఫ్ అనే పథకం అమల్లో లేదని తహసీల్దార్లు, గ్రామ, వార్డు సచివాలయాల పర్యవేక్షకులు తేల్చి చెప్పారు. రాష్ట్రంలో వితంతువులు దళారుల్ని నమ్మి మోసపోవద్దని సూచిస్తున్నారు. కొందరు సోషల్ మీడియాలో ఈ పథకం ఉన్నట్లు ప్రచారం చేస్తున్నారని.. నమ్మొద్దని సూచిస్తున్నారు.

# బర్త్,డెత్ సర్టిఫికేట్లు తీసుకోవడం సులభం

ఆంధ్రప్రదేశ్: కూటమి ప్రభుత్వం ప్రజలకు అవసరమైన ధ్రువ పత్రాల జారీ విషయంలో జాగ్రత్తలు తీసుకుంటోంది. ప్రజలు సులభం గా పత్రాలు తీసుకునేందుకు ఏర్పాట్లు చేసింది. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఇప్పటికే ధ్రువపత్రాల జారీపై ఫోకస్ పెట్టింది. అయితే పుట్టిన, చనిపోయినట్లుగా ధ్రువపత్రాలు పొం దడం చాలా ముఖ్యం. చాలామందికి వీటిని ఎలా పొందాలో తెలియక ఇబ్బందులు పడు తున్నారు. ఇంట్లో లేదా ప్రభుత్వ ఆసుపత్రుల్లో పుట్టినా, చనిపోయినా అక్కడే ఈ సర్టిఫికెట్లు ఇస్తారు. కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రుల్లో అయితే ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసి సర్టిఫికెట్లు ఇస్తారు. అవసరమైనప్పుడు దరఖాస్తు చేసుకుంటే పంచాయతీ ఈవో సంతకంతో ఈ సర్టిఫికెట్లు జారీ చేస్తారు. 2016కు ముందు పుట్టినవారి వివరాలు ఆన్‌లైన్‌లో లేకపోతే, యూనిఫైడ్ బర్త్, డెత్ విభాగంలో దరఖాస్తు చేసుకోవాలి. పంచాయతీ రికార్డులు పరిశీలించి సర్టిఫికెట్లు ఇస్తారు. ఇళ్లల్లో పుట్టిన, చనిపోయిన వారి వివరాలు రికార్డుల్లో లేకపోతే, నాన్-అవైలబిలిటీ సర్టిఫికేట్ కోసం వార్డు, గ్రామ సచివాలయాల్లో లేదా మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. ఈ సర్టిఫికేట్ వచ్చిన



తర్వాత, లేట్ రిజిస్ట్రేషన్ బర్త్, డెత్ విధానం లో దరఖాస్తు చేస్తే, అధికారులు విచారించి ధ్రువపత్రాలు జారీ చేస్తారు. ఒకసారి నమోదైన పేర్లను పూర్తిగా మార్చడం కుదరదు. తప్పులు సరిచేయడానికి లాయర్ అఫిడవిట్ తప్పనిసరిగా సమర్పించాలి. ఇళ్లల్లో పుట్టినా, చనిపోయినా పూర్తి ఆధారాలతో 21 రోజుల్లోపు దరఖాస్తు చేసుకుంటే, అధికారులు విచారించి ధ్రువపత్రాలు ఇస్తారు. ఈ లోపు పేర్లు, చిరునామా తప్పుగా ఉంటే సరిచేసుకునే అవకాశం ఉంటుంది. ఈ ప్రక్రియ ద్వారా, ఎటువంటి రికార్డులు లేని జనన, మరణాల వివరాలను అధికారికంగా నమోదు చేసుకోవచ్చు. ఇది ప్రజలకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది అంటున్నారు.

### ఇంటికే కుల ధ్రువీకరణ పత్రాలు

అంతేకాదు కుల ధ్రువీకరణ పత్రాలు ఇకపై అందరికీ సులభంగా అందనున్నాయి. దరఖాస్తు చేయకుండానే ప్రభుత్వం నేరుగా అందిస్తోంది. ఇంటింటా సర్వే ద్వారా వివరాలు సేకరించి, త్వరలోనే ఈ పత్రాలను అందజేయనుంది. కుల ధ్రువీకరణ పత్రాలు కావాల్సిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం నేరుగా అందించేందుకు చర్యలు చేపట్టింది. ఎవరూ దరఖాస్తు చేయకపోయినా, ప్రభుత్వం స్వయంగా (సుమోటోగా) ఈ పత్రాలను జారీ చేయనుంది. ఒకసారి పత్రం జారీ అయిన తర్వాత, మళ్లీ అవసరమైతే వాట్సాప్ మిత్ర ద్వారా లేదా ఆన్‌లైన్‌లో ఎప్పుడైనా సులభంగా పొందవచ్చు. ప్రభుత్వం ఇంటింటా సర్వే నిర్వహిస్తోంది. రెవెన్యూ సిబ్బంది కూడా ఇంటింటికీ వెళ్లి ప్రజల వివరాలను సేకరిస్తున్నారు. ఈ సర్వే ద్వారా ప్రజల వివరాలను సేకరించి, త్వరలోనే కుల ధ్రువీకరణ పత్రాలను అందజేయనుంది. గతంలో కుల ధ్రువీకరణ పత్రాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడేవారు. అలాంటి పరిస్థితి మళ్లీ రాకుండా కూటమి ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది.

# రేషన్ కార్డులు ఉన్నవారికి గుడ్‌న్యూస్..

ఆంధ్రప్రదేశ్: రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. ఇకపై నిత్యావసరాలు 12 గంటల పాటు అందుబాటులో ఉంటాయి. ఈ కొత్త విధానాన్ని మొదట తిరుపతి, రాజమహేంద్రవరం, విశాఖపట్నం, గుంటూరు, విజయవాడ నగరాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయనున్నారు. ఈ మార్పులో భాగంగా, తిరుపతిలోని కొన్ని రేషన్ దుకాణాలను 'మినీ మాల్స్'గా మార్చేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం రేషన్ షాపులు నెలలో 1 నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు మాత్రమే తెరిచి ఉంటాయి. అయితే మినీ మాల్స్ ఏర్పాటుతో ఈ దుకాణాలు రోజుకు 12 గంటల పాటు తెరిచి ఉంచుతారు.

ఈ మినీ మాల్స్‌కు జాతీయ వ్యవసాయ సహకార సొసైటీ, గిరిజన కార్పొరేషన్ల నుంచి నిత్యావసరాలను సరఫరా చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. తిరుపతిలో 15 రేషన్ దుకాణాలను మినీ



> ఈ మినీ మాల్స్ ద్వారా నిత్యావసరాల సరఫరా మరింత మెరుగుపడుతుం దని అధికారులు ఆశిస్తున్నారు. పైలట్ ప్రాజెక్టుగా, ప్రతి నగరంలో 15 చొప్పున మొత్తం 75 రేషన్ దుకాణాలను ఎంపిక చేస్తున్నారు. ఈ వారంలోనే ఈ ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు తెలిపారు. ఇప్పటివరకు రేషన్ డీలర్లు రోజులో కొద్ది సేపు మాత్రమే దుకాణాల్లో ఉండేవారు. మిగతా సమయంలో ఇతరపనులు చేసుకునేవారు.

మాల్స్‌గా మార్చనున్నారు. వీటిని ఎంపిక చేసి, పూర్తి వివరాలతో ఉన్నతాధికారులకు నివేదించినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి శేషాచలం రాజు తెలిపారు. ఈ మార్పుతో రేషన్ కార్డుదారులు తమకు కావలసిన సరుకులను మరింత సౌకర్యవంతంగా, ఎక్కువ సమయం పాటు కొనుగోలు చేయగలుగుతారు. ఈ మినీ మాల్స్ ద్వారా నిత్యావసరాల సరఫరా మరింత మెరుగుపడుతుం దని అధికారులు ఆశిస్తున్నారు. పైలట్ ప్రాజెక్టుగా, ప్రతి నగరంలో 15 చొప్పున మొత్తం 75 రేషన్ దుకాణాలను ఎంపిక చేస్తున్నారు.

ఈ వారంలోనే ఈ ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు తెలిపారు. ఇప్పటివరకు రేషన్ డీలర్లు రోజులో కొద్దిసేపు మాత్రమే దుకాణాల్లో ఉండేవారు. మిగతా సమయంలో ఇతర పనులు చేసుకునేవారు. కానీ, మినీమాల్స్ విధానంలో వారు రోజంతా దుకాణంలోనే ఉండాలి. డీలర్లు నష్టపోకుండా, వారికి ఉపాధి కల్పించేలా మినీమాల్స్‌లో అన్ని రకాల నిత్యావసర వస్తువులను అందుబాటులో ఉంచ నున్నారు. ఈ మార్పుతో, రేషన్ బియ్యం తో పాటు ఇతర నిత్యావసరాలను కూడా ప్రజలు ఒకే చోట కొనుగోలు చేసే అవకాశం కలుగు తుంది. ఈ కొత్త విధానం ద్వారా ప్రజలకు మరింత సౌకర్యవంతంగా ఉంటుందని భావిస్తున్నారు.

# ఫ్లాస్క్‌లోని వేడి టీ తాగి.. నాలుగేళ్ల చిన్నారి మృతి..



అనంతపురం: జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. మంచినీళ్లు అనుకుని వేడి టీ తాగి నాలుగేళ్ల చిన్నారి ప్రాణాలు కోల్పోయాడు. యాడికిలో ఈ విషాదం చోటుచేసుకుంది. యాడికిలోని చెన్నకేశవస్వామి కాలనీలో రామస్వామి, చాముండేశ్వరి దంపతులు నివసిస్తున్నారు. వీరికి హృతిక్ అనే నాలుగేళ్ల కొడుకు, యశస్విని అనే ఏడాదిన్నర వయసు గల కూతురు ఉన్నారు. అయితే మూడు రోజుల కిందట హృతిక్ ఫ్లాస్క్‌లో ఉన్న టీని.. నీళ్లు అని తాగేశాడు. టీ బాగా వేడిగా ఉండటంతో బాధతో విలవిల్లాడిపోయాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు.. హృతిక్‌ను వెంటనే తాడిపత్రిలోని ఆస్పత్రికి తరలించారు.

అక్కడి వైద్యులు మెరుగైన చికిత్స కోసం అనంతపురం వెళ్లాలని సూచించగా.. కుటుంబసభ్యులు వెంటనే అనంతపురం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ హృతిక్ శుక్రవారం ప్రాణాలు కోల్పోయాడు, దీంతో ఆ కుటుంబం గుండెలు పగిలేలా రోదిస్తోంది, అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు అనుకోని విధంగా ప్రాణాలు కోల్పోవటంతో.. ఆ కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

# నన్ను అంతం చేయాలనే కుట్ర..

విజయనగరం: వైఎస్సార్‌సీపీ నేత, శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. తనను అంతమొందించేందుకు కొందరు కుట్ర పన్నారని ఆరోపించారు. ఈ విషయంపై విచారణ జరపాలని గవర్నర్, సీఎస్‌లకు లేఖ రాస్తానని తెలిపారు. పైడితల్లి సిరిమానోత్సవంలో వేదిక కూలిపోవడంపై కలెక్టర్, ఎస్పీల బాధ్యతను ప్రశ్నించారు.వ్యక్తిగత కక్షతో కొందరు హతమార్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ కుట్రపై సమగ్ర విచారణ జరపాలని కోరుతూ గవర్నర్‌కు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాస్తానన్నారు. పైడితల్లి సిరిమానోత్సవంలో, తన కుటుంబ సభ్యులతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకుల కోసం ఏర్పాటు చేసిన వేదిక కూలిపోవడంపై బొత్స తీవ్రంగా స్పందించారు.

ఈ ఏడాది అధికారులు ద్వంద్వ వైఖరి ప్రదర్శించారని, ఆర్భాటం, అహంకారం తప్ప సాంప్రదాయాలకు తావివ్వలేదని ఆరోపించారు. ఉత్తరాంధ్ర ఇలవేల్పు అయిన పైడితల్లమ్మ



కరుణాకటాక్షాలతో ఈ ప్రాంతం సుభిక్షంగా ఉందని, పూర్వం పెద్దలు సొంత నిధులతో ఉత్సవాలు చేసేవారని.. ఇప్పుడు ప్రభుత్వం, అధికారుల సమక్షంలో పెద్ద ఎత్తున జరుగుతున్నాయన్నారు. తాను 15 ఏళ్లు మంత్రిగా, 5 ఏళ్లు ఎంపీగా ఉన్నప్పుడు ఉత్సవాల్లో పాల్గొన్నానని.. కానీ ఈ ఏడాది అధికారులు సరైన ప్రమాణాలు పాటించలేదని, కొంతమంది ప్రాపకం కోసం విడ్డూరంగా ప్రవర్తించారని ఆయన విమర్శించారు. పండగలో ఆర్భాటం, ఆహంకారం తప్ప సాంప్రదాయాలకు తావివ్వలేదన్నారు.ఇది తాను వ్యక్తిగతంగా చెప్పడం లేదని, విజయనగరం పట్టణంలో ఏ తలుపుతట్టి ప్రజల అభిప్రాయం తీసుకున్నా ఇదేమాట అంటారన్నారు.

గోవా గవర్నర్ ఇంకా విజయనగరంలోనే ఉన్నారని.. గతంలో ఆయన చెప్పిన మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు బొత్స. అధికారులకు ఆయన దిక్సూచిగా ఎందుకు నిలబడలేదని.. . అమ్మవారి దర్శనానికి సంబంధించి తన వ్యక్తిగత ప్రోటోకాల్‌పై తాను లేఖ రాశానని, దానికి అధికారులు తోచిన ఏర్పాట్లు చేశారని, అయితే ఉత్సవాల్లో ఏం జరిగిందో అందరూ చూశారన్నారు. తాము కూర్చున్న వేదిక కూలిపోవడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇది కుట్రనా, అధికారుల అలసత్వమా, లేక తమను అవమానించాలని చేసిన పనా, లేక అంతమొందించాలని చూశారా అని ప్రశ్నించారు. అధికారులు దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ వేదిక కూలిన ఘటనలో ఎమ్మెల్సీ సురేష్ బాబు చేయి డిస్ లోకేట్ అయిందని.. మరొకరికి ఫ్రాక్చర్ అయిందని, మరో అమ్మాయికి కూడా దెబ్బలు తగిలాయన్నారు.

జరిగిన నిర్లక్ష్యం, అలసత్వం, కుట్ర అంటూ ఘాటు వ్యాఖ్య లు చేశారు బొత్స. ప్రజాస్వామ్యంలో ఇలాంటివి సరైనవి కావని, వీటిని ఉపేక్షిస్తే సమాజానికి నష్టమ న్నారు.దీని వెనుక ఎవరున్నారనే వివరాలు బయట కు రావాలని, జిల్లా అధికారులను ప్రశ్నించారు. రాజకీయ నాయకులు వ్యక్తిగత ఆలోచనలతో మాట్లాడుతారన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం వ్యవస్థలను దిగజార్చడం సరికాదన్నారు.



# పరగడుపున ఈ జ్యూస్ తాగితే ఈజీగా బరువు తగ్గుతారు..

బరువు తగ్గే విషయంలో చాలా మంది కొన్ని తప్పులు చేస్తుంటారు. సరిగ్గా తినకపోవడం, తక్కువగా తినడం ఇలా చేస్తుంటారు. దీని వల్ల హెల్త్ పాడైపోతుంది. దీని బదులు తింటూనే బరువు తగ్గండి. అందుకోసం విటమిన్స్, మినరల్స్ ఎక్కువగా ఉండి కేలరీలు తక్కువగా ఉండే ఫుడ్‌ని ఎంచుకోండి. అందులో పండ్లు కూడా ముఖ్యమే. వీటితో జ్యూస్ చేసుకుని తాగితే బరువు తగ్గుతారు. అందులో ద్రాక్షరసం కూడా ఒకటి. మరి ఈ జ్యూస్‌ని ఎలా చేయాలి. ఎలా వర్క్ అవుతుందో పూర్తిగా తెలుసుకుందాం.

కావాల్సిన పదార్థాలు.. ద్రాక్ష : అరకప్పు, ఉప్పు : పావు చెంచా, పసుపు : కొద్దిగా
అల్లం : చిన్న ముక్క, నిమ్మకాయ : 1, పుదీనా : 15 ఆకులు.

తయారీ విధానం.. ముందుగా ద్రాక్ష పళ్ళని కడగాలి. వీటిపై చాలా కెమికల్స్ ఉంటాయి కాబట్టి, నీటితో బదులు ఓ గిన్నెలో నీరు పోసి పసుపు, ఉప్పు వేసి ద్రాక్ష పళ్ళని పదినిమిషాలు నానబెట్టాలి. తర్వాత వాటిని బాగా కడిగి మిక్సీజార్‌లో వేసి పుదీనా, నిమ్మరసం, అల్లం తురుము, కొద్దిగా ఉప్పు వేసి బాగా గ్రైండ్ చేసి వడకట్టాలి.

ఆ తర్వాత పులుపుని బట్టి కావాల్సినంత నీటిని కలపాలి. దీనికి చక్కెర, తేనె కలపకూడదు. ప్రతిరోజూ కూడా ఖాళీ కడుపుతోనే ఈ డ్రింక్ తాగితే త్వరగా బరువు తగ్గుతారు. బాడీలోని ట్యాక్సిన్స్, వ్యర్థాలను తొలగించి డీటాక్స్ చేయడంలో, బాడీలోని అనవసరమైన కొవ్వు పేరుకుకపోకుండా చేయడంలో ఈ జ్యూస్ హెల్ప్ చేస్తుంది.

ద్రాక్షలోని పోషకాలు.. ద్రాక్షలో చక్కెర ఉంటుంది 100 గ్రాముల ద్రాక్షలో కేవలం 6 గ్రాముల చక్కెర ఉంటుంది. కేలరీలు మాత్రం చాలా తక్కువ. 100 గ్రాముల ద్రాక్షలో 67 నుంచి 71 గ్రాముల కేలరీలు ఉంటాయి. కొవ్వు పదార్థాలు ఉండవు. ఇందులోని పోషకాలు, యాంటీ ఆక్సిడెంట్స్, కరిగే పీచు పదార్థాలన్నీ కూడా బాడీలోని కొవ్వుని కరిగించి బరువుని తగ్గించడంలో హెల్ప్ చేస్తుంది.






బరువు తగ్గించడంలో నిమ్మకాయ.. విటమిన్ సి ఎక్కువగా ఉండే పండ్లలో నిమ్మకాయ ఒకటి. ఇందులో బాడీకి అవసరమైన విటమిన్స్, మినరల్స్, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. రోజూ ఓ గ్లాసు నిమ్మరసం తీసుకుంటే బాడీలో జీవక్రియలు పెరిగి శరీర బరువు తగ్గుతుంది. అల్లంలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు కడుపు, ప్రేగుల్లో ఇన్ఫెక్షన్ ప్రమాదాన్ని తగ్గిస్తాయి. చెడు బ్యాక్టీరియాను నాశనం చేస్తాయి. ప్రేగు కదలికలను మెరుగ్గా చేస్తాయి. ఇది బాడీలోని చెడు కొలెస్ట్రాల్‌ని కరిగించి శరీర బరువుని తగ్గించడంలో సాయపడుతుంది. ఊబకాయం, గుండె సమస్యలు ఉన్నవారు అల్లాన్ని ఆహారంలో చేర్చడం ద్వారా గుండె సమస్యల్ని తగ్గించుకోవచ్చు. పుదీనా నోటితో పాటి బాడీని కూడా రిఫ్రెష్ చేస్తుంది. జీర్ణక్రియని మెరుగ్గా చేస్తుంది. బాడీలో జీవక్రియను పెంచుతుంది. కేలరీలు లేకుండా బరువు తగ్గడానికి సాయపడే ఫుడ్స్‌లో పుదీనా ఒకటి. దీనిని మీ ఫుడ్‌లో చేర్చడం వల్ల స్పీడ్‌గా బరువు తగ్గుతారు. వీటన్నింటి కలయిక వల్ల త్వరగా బరువు తగ్గుతారు.

# తగ్గాలనుకుంటున్నారా..?

వెయిట్ లాస్ జర్నీ సక్సెస్ అవ్వడానికి.. హెల్తీ బ్రేక్‌ఫాస్ట్ పునాది అనొచ్చు. ఉదయాన్నే బ్రేక్‌ఫాస్ట్ చేయడం ఆరోగ్యానికి ఎంతో అవసరం. అది మన శరీరంలో జీవక్రియలకు దోహదం చేస్తుంది. మన రోజువారీ పనులు చేసేందుకు శక్తిని అందిస్తుంది. మన భారతదేశంలో ఎన్నో హెల్తీ బ్రేక్‌ఫాస్ట్ ఆప్షన్స్ ఉన్నాయి. ఉదయం పూట మనం తీసుకునే ఆహారం పోషకాలతో నిండి ఉండాలని, మనల్ని ఎక్కువసేపు సంతృప్తిగా ఉంచేవి ఎంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. బరువు తగ్గడానికి మీకు సహాయపడే ఆరు ఆరోగ్యకరమైన బ్రేక్‌ఫాస్ట్ కాంబినేషన్స్ ఈ స్టోరీలో చూద్దాం.



ఓట్స్, పెరుగు, బెర్రీస్.. ఓట్స్‌లోని అధిక ఫైబర్, కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్ కంటెంట్ కారణంగా, మీ కడుపు ఎక్కువసేపు నిండుగా ఉంటుంది. ఓట్స్ రక్తంలో చక్కెర స్థాయిలను కంట్రోల్‌లో ఉంచడానికి సహాయపడతాయి. ఇది బరువు తగ్గడాన్ని ప్రోత్సహిస్తుంది. పెరుగులోని ప్రోబయోటిక్స్ పేగు ఆరోగ్యానికి తోడ్పడతాయి. ఇది జీవక్రియను మెరుగుపరుస్తుంది. బెర్రీస్‌లో విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి. మీరు ఉదయం పూట ఓట్స్‌లో పెరుగు, బెర్రీస్ కలుపుకుని తింటే.. త్వరగా వెయిట్ లాస్ అవుతారు.



అటుకులు, మొలకలు.. అటుకుల్లో గ్లూకోజ్, క్యాలరీలు, కొవ్వుల్లాంటి బరువు పెంచే పదార్థాలు అసలు ఉండవు. కాబట్టి బరువు తగ్గాలనుకునే వారు వెంటనే దీనిని తమ ఆహారంలో చేర్చుకోవడం ఉత్తమం. అటుకలలో ఐరన్ పుష్కలంగా ఉంటుంది.. ఇది రక్తహీనత సమస్యలున్న వారికి ఇది మంచి ఆహారం. ఇందులో ఫైబర్ సమృద్ధిగా ఉండడంతో తేలికగా జీర్ణమవుతుంది. ఇందులోని ఎ, బి, సి, కె- విటమిన్లు, ప్రొటీన్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. మొలకల్లో విటమిన్లు, ప్రొటీన్లు సమృద్ధిగా ఉంటాయి. ఇది బరువు నియంత్రణలో సహాయపడుతుంది. అటుకులు, మొలకల కాంబినేషన్.. మీమ్మల్ని రోజంతా యాక్టివ్‌గా, నిండుగా ఉంచుతుంది. బరువు తగ్గాలనుకునేవారికి ఇది బెస్ట్

ఇడ్లీ, చట్నీ, సాంబార్..ఇడ్లీని ఆవిరిలో వండుతారు. దీనిలో కొవ్వు, క్యాలరీలు తక్కువగా ఉంటాయి. సాంబార్ పప్పు, రకరకాల కూరగాయలతో తయారు చేస్తారి. దీనిలో ప్రొటీన్, ఫైబర్, పోషకాలు మెండుగా ఉంటాయి. కొబ్బరి, వేరుశనగ వంటి చట్నీలలోనూ ప్రొటీన్, మంచి కొవ్వులు ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి మేలు చేయడంతో పాటు.. బరువును కంట్రోల్‌లో ఉంచుతాయి.

దాలియా, కూరగాయలు..దాలియాలో క్యాలరీలు తక్కువగా ఉంటాయి, ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను ప్రోత్సహిస్తుంది. దీన్ని ఇంకా హెల్తీగా మార్చడానికి కూరగాయలు ఎక్కువగా వేయండి. కూరగాయలలో మినరల్స్, విటమిన్లు మెండుగా ఉంటాయి. ఇది మిమ్మల్ని సంతృప్తికరంగా, ఆరోగ్యంగా ఉంచుతుంది. వీట్ బ్రెడ్, గుడ్డు..గుడ్డు పోషకాల నిలయం. ఇందులో మాంసకృత్తులు (ప్రోటీన్), అత్యవసరమైన 9 అమైనో ఆమ్లాలు, బి కాంప్లెక్స్ విటమిన్లు, డి విటమిన్, ఖనిజాలు దండిగా ఉంటాయి. హెూల్ వీట్‌బ్రెడ్ ఫైబర్, కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లను అందిస్తుంది. ఈ కాంబినేషన్‌లో ప్రొటీన్ అధికంగా ఉంటుంది. ఇది మిమ్మల్ని ఎక్కువసేపు నిండుగా ఉంచుతుంది.

# పంటి నొప్పిగా ఉందా..











చాలా కారణాల వల్ల కొంతమందికి దంత సమస్యలు, చిగుళ్ళ సమస్యలు ఎదురైతే. ఇందులో నోటి శుభ్రత లేకపోవడం, ముఖ్యంగా రాత్రుళ్ళు భోజనం తర్వాత నోటిని క్లీన్ చేయకపోవడం ఉంటాయి. ఈ కారణాల వల్ల నోటిలోనే బ్యాక్టీరియా పెరిగి దంతాల ఆరోగ్యం పాడవుతుంది. దీంతో భరించలేని నొప్పి కూడా వస్తుంది. అయితే, ఈ నొప్పి అనేది రాత్రుళ్ళు వస్తే ఇబ్బందిగా ఉంటుంది. అలాంటప్పుడు కొన్ని టిప్స్ పాటించొచ్చు. వీటి వల్ల చాలా వరకూ సమస్యని తగ్గించుకోవచ్చు. అవేంటో మరి ఇప్పుడు చూద్దాం.


వెలగపండు.. వెలగపండుని దేవుళ్ళకి ప్రసాదంగా సమర్పిస్తారు. ఈ ఫ్రూట్‌ని సిరప్‌లా చేసి తాగడం మంచిది. ఈ పండులో క్యాన్సర్, మధుమేహం, ఊబకాయం, దంతాలు, చిగుళ్ళ సమస్యలు దూరమవుతాయి. కాబట్టి పంటినొప్పిగా ఉన్నప్పుడు ఈ పండుని తీసుకోండి.

పిప్పర్‌మెంట్ ఆయిల్.. పుదీనా ఆకుల్లో మెంథాల్ అనే సహజ సమ్మేళనం పుష్కలంగా ఉంటుంది. దీనిని వాడడం వల్ల నొప్పి తగ్గుతుంది. దీనిని వాడి సమస్య తగ్గేందుకు ముందుగా కొబ్బరి నూనెలో ఆరు చుక్కల పిప్పరమెంట్ ఆయిల్ కలపండి. ఈ నూనెలో దూదిని ముంచి నొప్పి ఉన్న పంటి రాయండి. ఇలా చేస్తే కచ్చితంగా నొప్పి తగ్గుతుంది.

ఉప్పు నీటితో.. దంతసమస్యల్ని దూరం చేయడంలో ఉప్పు నీరు కూడా కీ రోల్ పోషిస్తాయి. ఇందుకోసం ఓ గ్లాసు గోరువెచ్చని నీటిలో ఓ టీ స్పూన్ ఉప్పు కలపండి. దీనిని నోటిలో వేసుకుని 30 సెకన్ల పాటు పుక్కిలించండి. దీని వల్ల చిగుళ్ళ సమస్యలు దూరమవుతాయి.

నేరేడు పండు.. వీటిని చూడగానే చాలా మందికి నోరూరిపోతుంటుంది. వీటిని తినడం వల్ల ఎన్నో అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు అందుతాయి. ముఖ్యంగా నోటి దుర్వాసన దూరమై చిగుళ్ళ ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఈ పండులో విటమిన్ ఎ, సిలు పుష్కలంగా ఉండడం వల్ల నోటి ఆరోగ్యాన్ని కాపాడుతుంది.





అతిమధురం.. దీనిని వాడడం వల్ల మన శరీరంలో ఇమ్యూనిటీ పెరుగుతుంది. ఆయుర్వేద నిపుణుల ప్రకారం తియ్యగా ఉండే ఈ మూలిక పంటి నొప్పి, పొడి దగ్గు, గొంతు నొప్పి, షుగర్ వంటి సమస్యలు దూరమవుతుంది. ఏం చేయాలంటే.. రాత్రి పడుకునే ముందు ఓ గ్లాసు నీటిలో అతి మధురం ముక్కని నానబెట్టి ఉదయాన్నే ఆ నీటితో పుక్కిలించాలి. ఇలా చేయడం వల్ల చిగుళ్లు, దంత సమస్యలు దూరమవుతాయి.

వేపాకులు.. వేప..ఈ అద్భుత మూలిక చాలా చేదుగా ఉంటుంది. ఇది అన్ని విధాలుగా ఆరోగ్యాన్ని కాపాడుతుంది. వేపలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవన్నీ కూడా సమస్యలతో పోరాడడానికి హెల్ప్ చేస్తాయి. ఆరోగ్య నిపుణుల ప్రకారం, వేపాకుల్లో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ మైక్రోబియల్ లక్షణాలు, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు, యాంటీ వైరల్ లక్షణాలతో నిండి ఉన్నాయి. అందుకే, ఆయుర్వేదంలో దీనిని దంతసమస్యలకి ట్రీట్‌మెంట్‌గా వాడతారు. ఇన్ని ఆరోగ్య గుణాలున్న వేపాకులని కొద్దిగా నమిలి తినాలి. దీని వల్ల దంత, చిగుళ్ళ సమస్యలతో పాటు, నోటి దుర్వాసన కూడా దూరమవుతుంది. అయితే, ఈ టిప్స్ వాడినప్పుడు ఫలితం లేకపోతే వెంటనే డాక్టర్‌ని కలిసి సమస్య గురించి అడిగి ట్రీట్‌మెంట్ తీసుకోవడం ఉత్తమం.

# క్యాన్సర్‌కు చెక్ పెట్టవచ్చు..!

క్యాన్సర్ ప్రాణాంతక వ్యాధి. ప్రపంచవ్యాప్తంగా ఏటా లక్షలాది మంది ప్రాణాలను బలగొంటుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న మరణాలకు.. రెండవ ప్రధాన కారణం క్యాన్సర్. క్యాన్సర్ మన శరీరంలో ఎక్కడైనా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. వంశపారపర్యంగా వచ్చే క్యాన్సర్లు రాకుండా ఆపడం కొంచెం కష్టమే.. జీవనశైలి కారణంగానూ కొన్ని రకాల క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉంది. మీ లైఫ్‌స్టైల్‌లో మార్పులు చేస్తే ఈ క్యాన్సర్ల నుంచి దూరంగా ఉండొచ్చు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, స్మోకింగ్, ఆల్కహాల్‌కు దూరంగా ఉండటం, వ్యాయమం చేయడం వంటి అలవాట్లతో.. క్యాన్సర్ ముప్పును తగ్గించుకోవచ్చు. శరీరంలో క్యాన్సర్ పెరుగుదలను నిరోధించే సామర్థ్యం ఉన్న ఖనిజాలు, విటమిన్ల గురించి ఈ స్టోరీలో చూద్దాం. ఈ విటమిన్లు శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లుగా పనిచేస్తాయి. ఇవి ఫ్రీరాడికల్స్ వల్ల శరీర కణాలను రక్షించడానికి సహాయపడతాయి. ఫ్రీ రాడికల్స్ క్యాన్సర్ అభివృద్ధికి దోహద పడతాయి.










విటమిన్ సి, ఇ మ్యూటాజెనిసిస్, కార్సినోజెనిసిస్‌ను నిరోధించే సామర్థ్యం ఉంది. ఇవి క్యాన్సర్ కణాల పెరుగుదలను, క్యాన్సర్ కారకం-ప్రేరిత నష్టాన్ని ఆపుతాయి.పండ్లు, సిట్రస్ పండ్లు, క్యారెట్లు, పాలకూర, బ్రకోలీ, నట్స్ వంటి ఆహార పదార్థాలలో ఈ పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి మీ డైట్‌లో ఎక్కువగా చేర్చుకుంటే.. క్యాన్సర్ ముప్పును తగ్గించవచ్చు. విటమిన్ డి.. రోగనిరోధక వ్యవస్థను మెరుగుపరచడానికి, ఎముకలను బలంగా ఉంచడానికి విటమిన్ డి ముఖ్యం. విటమిన్ డి స్థాయిలు తగినంత ఉంటే.. కొన్ని క్యాన్సర్ల ప్రమాదాన్ని తగ్గించవచ్చని అధ్యయనాలను చెబుతున్నారు. విటమిన్ డి సప్లిమెంట్లను క్రమం తప్పకుండా తీసుకునే వ్యక్తులు మెలనోమా, కొలొరెక్టల్ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ వచ్చే ప్రమాదం తక్కువగా ఉందని అధ్యయనాలు కనుగొన్నాయి. విటమిన్ డి తగినంత పొందడానికి రోజూ ఉదయం, సాయంత్రం 10 నిమిషాల పాటు.. సూర్యరశ్మిలో ఉండాలి. సాల్మన్, మారేరెల్ వంటి ఆహారాలను మీ డైట్‌లో చేర్చుకోండి. విటమిన్ కె.. విటమిన్ కె కు క్యాన్సర్ వ్యతిరేక లక్షణాలు ఉంటాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. విటమిన్ కె క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధిస్తాయని అధ్యయనాలు చెబుతున్నాయి. కాలె, పాలకూర వంటి ఆకు కూరల్లో విటమిన్ కె సమృద్ధిగా ఉంటాయి. సెలీనియం ఒక ట్రేస్ మినరల్, ఇది యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. మరమ్మత్తులో సెలీ నియం సహాయపడుతుంది. కోక్రాన్‌లో 13 అధ్యయనాల సమీక్షలో, అత్యధిక సెలీనియం తీసుకునే సమూహాలలో 31% క్యాన్సర్ ప్రమాదాన్ని, 45% క్యాన్సర్ మరణాల ప్రమాదాన్ని తగ్గించింది. సెలీనియం బ్రెజిలియన్ గింజలు, సీఫుడ్, కొబ్బరి, తృణధాన్యాలు వంటి ఆహారాలలో సమృద్ధిగా ఉంటుంది. జింక్.. రోగనిరోధక పనితీరు, కణాల పెరుగుదలకు జింక్ అవసరం. జింక్ ఆక్సికరణ ఒత్తిడిని నియంత్రించడానికి కీలకపాత్ర పోషిస్తాయి. క్యాన్సర్ రాకుండా రక్షిస్తుంది. అయితే, అధిక మోతాదులో జింక్ తీసుకుంటే.. ప్రోస్టేట్ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. మెగ్నీషియం.. మెగ్నీషియం శరీరంలోని వందలాది జీవరసాయన ప్రతిచర్యలలో పాల్గొంటుంది. మన ఆరోగ్యాన్ని రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

# ఈ ఆకులతో ప్యాక్ వేస్తే..





కాలంతో సంబంధం లేకుండా ప్రతీ సీజన్‌లో లభించే పండ్లలో జామకాయ ఒకటి. తక్కువ ఖర్చులో లభించే ఈ పండ్లతో ఆరోగ్యానికి ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయి. శరీరంలో రోగనిరోధక శక్తిని పెండం, జీర్ణ వ్యవస్థకు మేలు చేయడం వంటి ఎన్నో లాభాలు ఉన్నాయి. జామ కాయలలోనే కాదు.. జామ ఆకులలోనూ పోషకాలు పుష్కలంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. జామ ఆకులు.. సౌందర్య పోషణకూ సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. వీటిలో యాంటీఆక్సిడెంట్, యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు మెండుగా ఉంటాయి. వీటితో పాటు పాలీఫెనాల్స్, కెరోటినాయిడ్లు, ఫ్లేవనాయిడ్స్, టానిన్ కెమికల్స్ ఉంటాయి. బ్యూటీ కేర్ జామ ఆకులు ఎలా యాడ్ చేసుకోవాలో ఈ స్టోరీలో చూద్దాం.

బ్లాక్‌హెడ్స్‌కు చెక్ పెడుతుంది..! బ్లాక్‌హెడ్స్ సమస్యకు జామాకులతో సులభంగా చెక్ పెట్టవచ్చు. దీనికోసం ఒక టేబుల్ స్పూన్ జామాకు పేస్ట్‌ని తీసుకోవాలి. దానికి అంతేమొత్తంలో కలబంద గుజ్జు, చిటికెడు పసుపుని కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసుకోవాలి. అలా 20 నిమిషాల పాటు ఉంచిన తర్వాత చల్లటి నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. వారానికి మూడుసార్లు ఇలా చేస్తే బ్లాక్ హెడ్స్ దూరం అవుతాయి.

జిడ్డు చర్మం ఉంటే..జిడ్డు చర్మం ఉన్నవారు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటు ఉంటారు. మీరు జిడ్డు చర్మం కారణంగా బాధపడుతుంటే.. గుప్పెడు జామాకులను మెత్తగా నూరి, దానికి రెండు చెంచాల నిమ్మరసం కలిపి ముఖానికి ప్యాక్‌లా అప్లై చేయండి. దీన్ని అరగంట పాటు ఆరనిచ్చి చన్నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచూ చేస్తే.. జిడ్డు పోయి.. తాజాగా ఉంటారు.?

మొటిమలను నివారిస్తాయి.. ఈ రోజుల్లో చాలామంది అమ్మాయిలు మొటిమల సమస్యతో బాధపడుతున్నారు. అలాంటి వారికి జామాకు చక్కటి పరిష్కారం చూపుతుంది. జామాకులో యాంటీసెప్టిక్ గుణాలు అధికంగా ఉంటాయి. అవి మొటిమలకు కారణమయ్యే బ్యాక్టీరియాని నశింపజేస్తాయి. దీనికోసం జామాకులతో చేసిన పేస్ట్‌ని మొటిమల దగ్గర అప్లై చేసుకోవాలి. ఇలా ప్రతిరోజూ క్రమం తప్పకుండా చేస్తే మంచి రిజల్ట్స్ ఉంటాయి.

స్కిన్ ఇరిటేషన్ ఉంటే.. కప్పు మరిగే నీటిలో గుప్పెడు జామాకులను వేసి పది నిమిషాలు ఉడికించాలి. ఈ నీటిని వడకట్టి చల్లారాక స్ప్రే బాటిల్‌లో నింపాలి. చర్మం ఇరిటేటింగ్‌గా ఉన్నప్పుడు దీన్ని కాస్త చల్లితే సరి. దీన్ని స్కిన్ ఇరిటేషన్ ఉన్నప్పుడు చల్లుకోండి.

# మా జిల్లాలో పొంగులేటి పెత్తనం ఏంటి..?

వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో మరోసారి అంతర్గత విభేదాలు బయటపడ్డాయి. ఇన్‌చార్జ్ మంత్రిగా ఉన్న పొంగులేటి శ్రీనివాస రెడ్డిపై జిల్లా మంత్రి కొండా సురేఖ భర్త, సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక రాజకీయాల్లో జోక్యం చేసుకుంటున్నారని, పెత్తనం చెలాయిస్తున్నారని ఆరోపిస్తూ ఫైరయ్యారు. ఈ మేరకు ఏఐసీసీకి ఫిర్యాదు చేసినట్లు కొండా మురళి వెల్లడించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి రెవెన్యూ, సమాచార శాఖ బాధ్యతలు చూస్తుండగా.. కొండా సురేఖ దేవాదాయ శాఖ మంత్రిగా కొనసాగుతున్నారు.



దేవాదాయ శాఖకు సంబంధించిన అంశాల్లో ముఖ్యంగా మేడారం జాతర పనుల టెండర్ల వ్యవహారంలో మంత్రి పొంగులేటి అక్రమ జోక్యం చేసుకుంటున్నారని కొండా మురళి ప్రధానంగా ఆరోపించారు. మేడారం పనుల టెండర్లను పొంగులేటి తన సొంత కంపెనీకి, సన్నిహితులకు ఇప్పించుకున్నారని ఆరోపిస్తూ ఏఐసీసీకి ఫిర్యాదు చేశారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్ర నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అలాగే రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌కు పొంగులేటిపై ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై హైకమాండ్ నుంచి తనకు సానుకూల స్పందన వచ్చిందని కొండా మురళి వెల్లడించారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన పొంగులేటి శ్రీనివాస రెడ్డిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా నియమించింది. అయితే.. మంత్రిగా వరంగల్ అభివృద్ధి పనుల్లో పాల్గొంటున్న పొంగులేటి.. జిల్లాలోని ఇతర మంత్రులు, ఎమ్మెల్యేల అధికార పరిధిలోకి కూడా జోక్యం చేసుకుంటూ తమకు వ్యతిరేకంగా రాజకీయం చేస్తున్నారని కొండా మురళి వర్గం ఆరోపిస్తోంది. 'ఈ జిల్లాలో పొంగులేటి పెత్తనం ఏంటని' కొండా మురళి బహిరంగంగానే ప్రశ్నించారు. ముఖ్యంగా, కొండా మురళి సతీమణి కొండా సురేఖ కూడా రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలకు మధ్య విభేదాలు పెరుగుతున్న సమయంలోనే.. కొండా మురళి ఏకంగా ఇన్‌చార్జ్ మంత్రిపైనే హైకమాండ్‌కు ఫిర్యాదు చేయడం కాంగ్రెస్ అంతర్గత రాజకీయాల్లో పెను దుమారం సృష్టించింది. దీనిపై అధిష్ఠానం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి.

# స్థానిక సంస్థల ఎన్నికలపై అప్డేట్..



తెలంగాణ: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సందిగ్ధత కొనసాగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం (ఈసీ) కీలక అడుగు వేసింది. ఇటీవలి హైకోర్టు తీర్పు నేపథ్యంలో రిజర్వేషన్ల అంశంపై పూర్తి స్పష్టత ఇవ్వాలని కోరుతూ ఈసీ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. హైకోర్టు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ఎటువంటి అభ్యంతరం తెలపలేదని ఈసీ ఆ లేఖలో స్పష్టం చేసింది. రిజర్వేషన్లు 50 శాతం మించకుండా పాత పద్ధతిలో ఎన్నికలు నిర్వహించుకోవచ్చునని హైకోర్టు ఆదేశించిన విషయాన్ని.. అలాగే అదనంగా కేటాయించిన 17 శాతం రిజర్వేషన్లను ఓపెన్ కేటగిరీగా నోటిఫై చేసుకోవచ్చునని కోర్టు సూచించిన విషయాన్ని ఈసీ ప్రభుత్వానికి గుర్తు చేసింది.

కోర్టు తీర్పు దృష్ట్యా తదుపరి చర్యలు, ఎన్నికల ప్రక్రియను ఎలా ముందుకు తీసుకెళ్లాలనే అంశంపై ప్రభుత్వం నుంచి రాష్ట్ర ఎన్నికల సంఘం తక్షణమే వివరణ కోరింది. ఈ అంశానికి సంబంధించి కాసేపట్లో ఎన్నికల కమిషన్ కార్యాలయంలో ఉన్నతాధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని కీలక సమావేశం నిర్వహించబోతున్నారు. బీసీ రిజర్వేషన్లపై స్పష్టత లేకపోవడం వల్ల ఎన్నికల ప్రక్రియను వాయిదా వేయాలా లేదా ? తదుపరి చర్యలు ఏమిటో ఈ సమావేశంలో నిర్ణయిస్తారు. ఈ సమావేశంలో తీసుకునే నిర్ణయాల ఆధారంగానే తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఆధారపడి ఉంటుంది.

ఇక హైకోర్టు ఆదేశాలపై తెలంగాణ ప్రభుత్వం ఇప్పటివరకూ అధికారికంగా స్పందించలేదు. దీంతో ఈ తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం తదుపరి ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ అంశంపై ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశం ఉందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కాగా.. ఈనెల 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ కేబినెట్ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో బీసీ రిజర్వేషన్లతో పాటు, హైకోర్టు తాజా తీర్పుపై కూడా మంత్రివర్గం చర్చించి కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. హైకోర్టు జారీ చేసిన ఆర్డర్ కాపీపై ఎన్నికల సంఘం న్యాయనిపుణులతో సంప్రదింపులు జరుపుతోంది.

# టీజీఎస్ఆర్టీసీ గుడ్‌న్యూస్.. ఆ రూట్‌లో టికెట్ ధరలపై తగ్గింపు

హైదరాబాద్: ఈమధ్య కాలంలో తెలంగాణ ఆర్టీసీ ప్రయాణికులకు వరుసగా షాకింగ్ వార్తలే చెబుతూ వస్తోంది. దసరా పండగ నేపథ్యంలో ప్రత్యేక బస్సుల్లో టికెట్ ధర మీద ఏకంగా 50 శాతం పెంచిన సంగతి తెలిసిందే. అలానే సిటీ బస్సుల్లో కూడా టికెట్ ధరలను భారీగా పెంచి.. ప్రయాణికుల జేబుకు చిల్లు పెట్టింది. ఇక త్వరలోనే జిల్లాలకు నడిచే బస్సు సర్వీసుల్లో కూడా టికెట్ రేట్లు పెంచేందుకు సిద్ధమయినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఇలా వరుసగా బ్యాడ్‌న్యూస్‌లు చెబుతూ వస్తోన్న ఆర్టీసీ.. తాజాగా ఆ రూట్లో వెళ్లే ప్రయాణికులకు మాత్రం శుభవార్త చెప్పింది. టికెట్ ధర మీద 20 శాతం తగింపు ప్రకటించింది. ప్రయాణికులకు టీజీఎస్ఆర్టీసీ శుభవార్త చెప్పింది. టికెట్ ధర మీద 20 శాతం తగ్గింపు ప్రకటించింది. అయితే ఈ తగ్గింపు అన్ని మార్గాల్లో వర్తించదు. కేవలం హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్లే ప్రయాణికులకు మాత్రమే ఈ తగ్గింపు ఆఫర్ వర్తిస్తుంది. భాగ్యనగరం నుంచి బెంగళూరుకు వెళ్లే సూపర్ లగ్జరీ బస్సుల్లో టికెట్ ధర మీద 20 శాతం తగ్గింపు ప్రకటించింది. అలానే హైదరాబాద్ నుంచి తిరుపతికి వెళ్లే ప్రయాణి కులకు ఆర్టీసీ శుభవార్త చెప్పింది. హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్లే లహరి ఏసీ బస్సుల్లో.. టికెట్ ధర మీద 10 శాతం డిస్కౌంట్ ప్రకటించినట్లు వెల్లడించింది. నగరం నుంచి బెంగళూరు, తిరుపతి వెళ్లే ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరింది. ఇదిలా ఉంటే ఈ నెల అంటే అక్టోబర్ 6 నుంచి హైదరాబాద్ హైదరాబాద్ జంట



నగరాల పరిధిలో నడిచే ఆర్టీసీ బస్సుల్లో టికెట్ ధరలను పెంచిన సంగతి తెలిసిందే. సిటీ ఆర్డినరీ, ఈ-ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఈ-ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో టికెట్ ధరలను భారీగా పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీనిలో భాగంగా మొదటి 3 స్టేజీల వరకు ఐదు రూపాయల చొప్పున పెంచగా.. ఆ తర్వాత నుంచి అనగా 4వ స్టేజీ నుంచి 10 రూపాయల అదనపు ఛార్జీ వసూలు చేస్తున్నారు. ఇక మెట్రో డీలక్స్, ఈ-మెట్రో ఏసీ సర్వీసుల్లో మొదటి స్టేజీ నుంచే అదనంగా 5 రూపాయలు వసూలు చేస్తున్నారు. ఇక రెండో స్టేజీ తర్వాత అదనంగా రూ.10 ఛార్జీ వసూలు చేస్తున్నారు. ఆర్టీసీ తీసుకున్న ఈ నిర్ణయం అక్టోబర్ 6వ తేదీ అమల్లోకి వచ్చింది. దీనిపై విపక్షాలు పెద్ద ఎత్తున ఆందోళన చేశాయి. పెంచిన ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశాయి.

# నెలనెలా ఆదాయం పొందొచ్చు..!



తెలంగాణ: విద్యుత్ బిల్లుల భారం తగ్గించడం, వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 'ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ' పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం ద్వారా గృహ వినియోగదారులకు రాయితీపై సోలార్ ప్యానెళ్లను అందిస్తూ.. ఆర్థికంగా లబ్ధి చేకూర్చేందుకు ప్రణాళికలు రచించింది. ఈ పథకం కింద లబ్ధిదారులు తమ అవసరాలకు సరిపడా విద్యుత్తును తామే ఉత్పత్తి చేసుకొని, విద్యుత్తు బిల్లులను గణనీయంగా తగ్గించుకోవడం లేదా పూర్తిగా ఉచితంగా పొందడం చేసుకోవచ్చు. వినియోగానికి మించి ఉత్పత్తి అయిన విద్యుత్తును డిస్కమ్‌కు తిరిగి విక్రయించి, తద్వారా అదనపు ఆదాయాన్ని పొందొచ్చు.

పథకం కింద నిర్దిష్ట సామర్థ్యం వరకు సోలార్ పలకల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం రాయితీని నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తుంది. వరంగల్ జిల్లాను ఉదాహరణగా పరిశీలిస్తే.. 9 కేటగిరీలకు చెందిన 89,616 విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 'గృహజ్యోతి' పథకం కింద 200 యూనిట్లలోపు వాడుతున్న 40,965 కుటుంబాలు మినహా, ఆపై యూనిట్లు వినియోగించే వారిని అధికారులు చురుగ్గా సౌర విద్యుత్తు వైపు ప్రోత్సహిస్తున్నారు. ఇప్పటికే వివిధ సామర్థ్యాలకు చెందిన 50 సోలార్ ప్యానెళ్లు జిల్లాలో అమర్చినట్లు డిస్కమ్ గణాంకాలు చెబుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల ప్రజలు సైతం దరఖాస్తు చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు.

**దరఖాస్తు విధానం ఇదే..**

'ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ' పథకానికి దరఖాస్తు చేసుకునే విధానం పూర్తిగా ఆన్‌లైన్‌లో ఉంటుంది.

అర్హులైన గృహ యజమానులు http://www.pmsuryaghar.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి. ఈ-మెయిల్, విద్యుత్తు కనెక్షన్ వివరాలు, మొబైల్ నంబర్‌తో ప్రాథమిక రిజిస్ట్రేషన్ చేయాలి.

సర్వీస్ నంబరు, మొబైల్ నంబరుతో లాగిన్ అయి దరఖాస్తు ఫారమ్‌ను నింపాలి. పూర్వపు విద్యుత్తు వినియోగానికి సంబంధించిన వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలి.

దరఖాస్తు పూర్తయిన తర్వాత టీజీ రెడ్కో (TG REDCO), డిస్కమ్ అధికారులు, ప్రభుత్వం ఎంపిక చేసిన సౌరపలకల కంపెనీ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించి అనుమతి ఇస్తారు. నిర్ణీత రుసుం చెల్లించిన తర్వాత సోలార్ పలకలు, ప్యానెల్ బోర్డులను బిగిస్తారు. ట్రాన్స్‌కో ద్వారానే నెట్ మీటరును అమర్చుతారు, ఇది గృహ వినియోగం, డిస్కమ్‌కు విక్రయించిన విద్యుత్తును లెక్కిస్తుంది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత, ప్రభుత్వం నిర్ణయించిన రాయితీ సొమ్మును నేరుగా లబ్ధిదారు ఖాతాలోనే జమ చేస్తారు. సౌర పలకల ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్తు వినియోగానికి మించి ఉంటే, ఆ అదనపు కరెంటును డిస్కమ్ కొనుగోలు చేస్తుంది. ప్రతి ఆరు నెలలకు ఒకసారి వినియోగ వివరాలను లెక్కించి, యూనిట్‌కు రూ. 3.10 చొప్పున డిస్కమ్ ద్వారా లబ్ధిదారుడికి చెల్లిస్తారు. రూఫ్‌టాప్ కలిగిన అన్ని ఇళ్ల యజమానులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ పునరుత్పాదక, ఇంధన వనరుల అధికారులు సూచిస్తున్నారు. ఈ పథకం చాలా ఉపయోగకరంగా ఉంటుందని అదనపు ఆదాయం పొందొచ్చునని చెబుతున్నారు.

# బైక్‌పై 277 చలాన్లు..

రోడ్డు ప్రమాదాలు వంటి వాటిని తగ్గించడం కోసమే మాత్రమే కాక ప్రయాణకుల భద్రతను దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ పోలీసులు ఎన్నో రూల్స్ అమలు చేస్తున్నారు. పాటించకపోతే చలాన్లు విధిస్తున్నారు. ఎప్పుడైన ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడితే.. పెండింగ్ చలాన్ కడితేనే వాహనాన్ని వదిలి పెడుతున్నారు. లేదంటే సీజ్ చేస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలను పట్టించుకోని ఓ వాహనదారుడిపై కరీంనగర్ పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఐదేళ్ల కాలంలో అతడి బైక్ మీద 277 ట్రాఫిక్ చలాన్లు పెండింగ్ ఉన్నాయి. దీంతో అతడు చెల్లించాల్సిన జరిమానా మొత్తం రూ. 79,845కు చేరింది. ఇక త్జాజాగా ట్రాఫిక్ పోలీసులు అతడి



బైక్‌ని ఆపి చెక్ చేయగా.. ఆ బండి మీద 277 చలాన్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిసి పోలీసులే ఆశ్చర్యపోయారు. ఈ సంఘటన కరీంనగర్ పట్టణంలో జరిగింది. తాజాగా సిక్కు వాడి ప్రాంతంలో వాహనాలను ఆపి.. చెక్ చేస్తుండగా.. ఈ సంఘటన వెలుగు చూసింది. ఒక బైక్ మీద ఐదు సంవత్సరాల నుంచి 277 పెండింగ్ ట్రాఫిక్ చలాన్లు పేరుకుపోయినట్లు పోలీసులు గుర్తించారు. ఆ వెంటనే ఆ మోటార్ సైకిల్‌ను ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఈ తనిఖీల్లో హీరో యునికార్న్ మోటార్ సైకిల్ ను ఆపి దాని వివరాలను పరిశీలించగా.. ఆ బైక్ మీద పెద్ద సంఖ్యలో పెండింగ్ చలాన్లు ఉన్నాయని గుర్తించారు. ఈ చలాన్లు 2019, జూన్ 8 నుంచి 2024, డిసెంబర్ 25 వరకు.. కరీంనగర్, పరిసర ప్రాంతాలలో నమోదయ్యాయని గుర్తించారు. సదరు వాహనదారుడిని గోదాం గడ్డకు చెందిన అబ్దుల్ ఖయ్యూమ్ (37 సంవత్సరాలు) అనే వ్యక్తి ఈ బైక్ ఓనర్ అని తేలింది. అతడు ఆర్ఎంపీ ప్రాక్టీషనర్ అని గుర్తించారు. బైక్ మీద ఉన్న మొత్తం 277 పెండింగ్ చలాన్లలో ఎక్కువ భాగం (264) కరీంనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోనే నమోదయినట్లు తెలిసింది. హెల్మెట్ ధరించనందుకే 254 సార్లు చలాన్ విధించారు. దీంతో పాటు ఫేస్ మాస్క్ ధరించకపోవడం, ట్రిపుల్ రైడింగ్, ఫోన్ వాడుతూ డ్రైవ్ చేయడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడంతో పాటు సరైన నంబర్ ప్లేట్ లేకపోవడం.. అలానే జిగ్ జాగ్ డ్రైవింగ్ వంటి పలు కారణాల వల్ల చలాన్ విధించారు.

## ఈనెల 14న తెలంగాణ రాష్ట్ర బంద్..

తెలంగాణ: స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం బీసీ రిజర్వేషన్లను నిలిపివేస్తూ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులపై బీసీ సంఘాలు భగ్గుమన్నాయి. అది అన్యాయం అంటూ రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో ఈ నెల 14న రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో జరిగిన బీసీ సంఘాల సమావేశంలో కృష్ణయ్య మాట్లాడుతూ.. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తర్వాత రిజర్వేషన్లపై స్టే ఇవ్వడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి అని, ఇది బీసీలకు తీరని అన్యాయం, అవమానకరం అని మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్లు పెరిగినప్పుడల్లా కొందరు న్యాయస్థానాలను వేదికగా చేసుకుని అడ్డుకోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రాష్ట్ర బంద్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు మద్దతు తెలిపి విజయవంతం చేయాలని ఆయన కోరారు. సీ సంక్షేమ సంఘాల సమావేశంలో పాల్గొన్న విపక్ష నేతలు రాష్ట్ర ప్రభుత్వం తీరుపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఒక చేత్తో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తున్నట్లు ప్రకటించి, మరో చేత్తో హైకోర్టు ద్వారా వాటిని లాక్కుందని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లకు సంబంధించి జీఓను తప్పులతడకగా రూపొందించిందని, దీని ద్వారా బీసీలను మోసగించిందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు.

# 200 పరిశ్రమల ఏర్పాటుకు లేఅవుట్



తెలంగాణ: అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు తీసుకు వచ్చేందుకు కృషి చేస్తోంది. దీనిలో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. దీనిని తెలంగాణ కార్పొరేషన్ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఆధ్వర్యంలో.. జిల్లాలోని గణపురం మండలం గాంధీనగర్ శివారులో ఏర్పాటు చేశారు. సుమారు 60 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ ఇండస్ట్రియల్ పార్కు నిర్మాణ పనులు శరవేగంగా ముందుకు సాగుతున్నాయి. పోయిన సంవత్సరం ఈ ఇండస్ట్రియల్ పార్క్‌కు శంకుస్థాపన చేశారు. దీని ద్వారా జిల్లాలోని నిరుద్యోగులకు వేల సంఖ్యలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అధికారులు భావిస్తున్నారు.

కేటీపీపీ నుంచి వెలువడే బూడిదతో యాష్ బ్రిక్ వంటి అనుబంధ పరిశ్రమలు కూడా ఏర్పాటు కానున్నాయి. ఇక ఈ ఇండస్ట్రియల్ పార్కులో మొత్తం 200 పరిశ్రమల కోసం లేఅవుట్ సిద్ధం చేశారు. దీనిలో 500, 1000, 1500 గజాల మేర ప్లాట్లు అందుబాటులో ఉంటాయి. ఈ ఇండస్ట్రియల్ కారిడార్‌లో కాలుష్యరహిత పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, రెడీమెడ్ దుస్తులు, మిర్చి, పసుపు పొళ్లు, పిండిగిర్ని, గానుగ నూనె తయారీ, బియ్యం ఉత్పత్తి, యాష్ బ్రిక్ వంటి పరిశ్రమలు ఏర్పాటు చేయాలనుకునేవారికి అవకాశం కల్పిస్తామని తెలిపారు. టీజీఐఐసీ వెబ్‌సైట్‌లో అప్లై చేసుకోవాలని తెలిపారు. ఎంపికైన వారు రెండేళ్లలో పరిశ్రమను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ ఇండస్ట్రియల్ పార్కు రాకతో.. గాంధీనగర్ శివారులో అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోంది అంటున్నారు ఈ ప్రాంత వాసులు. గతంలో ఈ ప్రాంతంలోని వ్యవసాయ భూములకు వెళ్లడానికి ఇబ్బంది పడేవారు.. ఇప్పుడు సీసీ రోడ్ల నిర్మాణంతో చాలా సులభంగా వెళ్లగలుగుతున్నారు. ఈ పార్కు వల్ల వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ ఇండస్ట్రియల్ పార్క్ వల్ల ప్రత్యక్షంగా 4000 మందికి, పరోక్షంగా వెయ్యి మందికి ఉద్యోగాలు లభించే అవకాశం ఉంది. ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేయాలనుకునే వారికి టీప్రైడ్ ద్వారా ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 35 శాతం రాయితీతో స్వయం ఉపాధి కల్పించనున్నారు. టీఐడియా పథకం ద్వారా ఓసీ, బీసీ పారిశ్రామికవేత్తలకు కూడా రాయితీలు అందివ్వనున్నారు. పార్కు అందుబాటులోకి వచ్చి పరిశ్రమల స్థాపన మొదలైతే, గాంధీనగర్, మైలారం పరిసరాల్లో భూములకు డిమాండ్ విపరీతంగా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. అలానే ఇక్కడ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పితే.. మిరప, పసుపు, మొక్కజొన్న వంటి పంటలు పండించే రైతులు.. దీని వల్ల రవాణా ఖర్చులు తగ్గి, ఆదాయం పెరిగే అవకాశం ఉందంటున్నారు.

# రైతులకు రుణమాఫీ ఎప్పుడు..?

తెలంగాణ: రాష్ట్రంలో రైతు రుణమాఫీ కార్యక్రమం పూర్తిగా అమలు కాకపోవడంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. రెండు లక్షల రూపాయలకు పైబడి రుణాలు తీసుకున్నవారు, గత విడతల్లో మాఫీ వర్తించని రైతులు ప్రభుత్వ ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు. మరో వారం పది రోజుల్లోనే యాసంగి సీజన్ మొదలుకానుండటంతో.. పెట్టుబడికి సంబంధించిన సమస్య రైతన్నలను మరింతగా వేధిస్తోంది.

ప్రకృతి వైపరీత్యాల కారణంగా గతంలో పంట దిగుబడులు తగ్గడం, ఆపై పెరుగుతున్న వడ్డీ భారం రైతుల ఆర్థిక స్థితిని మరింత కష్టతరం చేస్తోంది. చాలామంది రైతులు రుణమాఫీపైనే గంపెడు ఆశలు పెట్టుకుని బ్యాంకులకు తిరిగి చెల్లించలేదు. రుణాల చెల్లింపులో జాప్యం జరగడంతో వడ్డీ మొత్తం పెరిగిపోతోంది. బ్యాంకు అధికారులు తిరిగి చెల్లించాలని ఒత్తిడి తీసుకురావడంతో.. తదుపరి రుణం మంజూరులో అడ్డంకులు ఎదురవుతాయేమోనని రైతులు పాలుపోవడం లేదు.

పంట సాగు, కోత పనులకు కూలీల కొరత కూడా తీవ్రంగా ఉంది. వికారాబాద్ జిల్లాలో కూలీలు దొరక్కపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి వారిని రప్పించాల్సి వస్తోంది. ఈ సంవత్సరం మొక్కజొన్న కోతలు మొదలయ్యాయి. వచ్చే నెలలో పత్తి తీసే పనులు ప్రారంభమవుతాయి. కిలో పత్తి తీయడానికి గతేడాది రూ. 14 వరకు ఖర్చు చేయాల్సి వచ్చింది. ఈ పెరిగిన కూలీ ఖర్చులు సాగును భారంగా మారుస్తున్నాయి.

రూ. 2 లక్షల వరకు రుణాలు తీసుకున్న రైతుల విషయంలో స్పష్టత లేకపోవడంతో.. జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో వివరాల సేకరణ చేపట్టారు. ఆధార్, పట్టాదారు పాసుపుస్తకాల నంబర్లు తప్పుగా నమోదవడం, ఒకే కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మంది వేర్వేరు బ్యాంకుల్లో రుణాలు తీసుకోవడం వంటి సమస్యలను అధికారులు నిశితంగా పరిశీలించారు. మండల వ్యవసాయాధికారి, ఏఈఓలు రైతుల నుంచి స్వీయ చిత్రాలు తీసుకుని డాక్యుమెంట్లను ప్రభుత్వానికి సమర్పించారు. క్లియరెన్స్ కోసం సంవత్సరం గడిచినా ఎలాంటి ఆదేశాలు




రాకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. వికారాబాద్ జిల్లా వ్యవసాయాధికారి టి. రాజారత్నం తెలిపిన వివరాల ప్రకారం.. గతంలో నాలుగు విడతల్లో సుమారు రూ. 842 కోట్లు వరకు రుణమాఫీ జరిగింది. అయితే.. రూ. 2 లక్షలకు పైబడిన రుణాల మాఫీకి సంబంధించి ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఉత్తర్వులు రాలేదని ఆయన వెల్లడించారు. యాసంగి సాగుకు ముందే పెండింగ్‌లో ఉన్న రుణమాఫీని పూర్తిగా అమలు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

# 21 రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలకు చెక్

హైదరాబాద్: నగరంలో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో స్కైవేలు, ఫుట్‌ఓవర్ వంతెనలు నిర్మించేందుకు హెచ్ఎండీఏ ముందుకు వచ్చింది. త్వరలోనే వీటి నిర్మాణ పనులు మొదలు కానున్నాయని తెలుస్తోంది. హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో ట్రిపుల్ఐటీ హైదరాబాద్ ఈ ప్రాజెక్టుపై అధ్యయనం చేస్తోంది. ఇప్పటికే నగరంలో అత్యధికంగా రద్దీ ఉండే 21 ప్రాంతాలను గుర్తించారు. త్వరలోనే మరిన్ని రద్దీ ఉండే ఏరియాలను గుర్తించి.. అక్కడ కూడా స్కైవేల నిర్మాణం చేపట్టాలని భావిస్తున్నారు. త్వరలోనే వీటిని గుర్తించి.. హెచ్ఎండీఏకు నివేదికను అందించనున్నారు. ఆ నివేదిక ఆధారంగా దశలవారీగా అవసరమైన చోట్ల స్కైవేలు, ఇతర ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టనున్నారు.

ఇప్పటికే ఉప్పల్ జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్యను అధిగమించడానికి.. మెట్రోను కలుపుతూ స్కైవేని నిర్మించారు. ఇది ఇప్పుడు పాదచారులకు ఎంతో సౌకర్యవంతంగా మారింది. మెహిదీపట్నంలో కూడా ప్రస్తుతం స్కైవే నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీంతో పాటు జేఎన్‌టీయూ, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ కూడళ్లలో కూడా స్కైవేల నిర్మాణం చేపట్టనున్నారు. దీనికి సంబంధించి సర్వే చేయడానికి అధికారులు ఇప్పటికే కన్సల్టెన్సీలను నియమించారు. భవిష్యత్తులో ఐటీ కారిడార్, ఐకియా, మియాపూర్ జంక్షన్, ఎల్బీనగర్‌లోని 10-15 ప్రాంతాలతో పాటు ఇతర వాణిజ్య, వ్యాపార జంక్షన్లలో కూడా స్కైవేలు అవసరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సాధారణంగా రోడ్లు దాటుతున్నప్పుడు.. లిఫ్టులు, ఎక్సలేటర్లు వంటివి అందుబాటులో లేకపోవడం వల్ల పాదచారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈక్రమంలో స్కైవేల నిర్మాణమే దీనికి పరిష్కారమని అధికారులు భావిస్తున్నారు. ట్రిపుల్ఐటీ అధ్యయనం పూర్తయ్యాక, అత్యంత రద్దీ ప్రాంతాలను ఎంపిక చేసి అక్కడ స్కైవేలు నిర్మించాలని హెచ్ఎండీఏ యోచిస్తోంది. వీటి నిర్మాణానికి సంబంధించి నిధుల సమస్యను అధిగమించడానికి కొన్నిచోట్ల ప్రైవేట్ పబ్లిక్ పార్టనర్‌షిప్(పీపీపీ) విధానంలో వీటిని నిర్మించనున్నారు. ఈ స్కైవేల నిర్మాణ ద్వారా.. నేరుగా



మెట్రో స్టేషన్లు, మాల్స్, ఐటీ కంపెనీలు,వాణిజ్య భవనాల్లోకి వెళ్లేలా ఏర్పాట్లు చేయనున్నారు. పోయిన సంవత్సరం హైదరాబాద్ పరిధిలో 1,032 మంది పాదచారులు రోడ్డు ప్రమాదాలకు గురయ్యారు. వీరిలో 400 మంది మృతి చెందగా.. 775 మంది గాయపడ్డారు. నగరంలో రోడ్డు ప్రమాద బాధితుల్లో 42 శాతం పాదచారులే ఉంటున్నారని నివేదికలు తెలిపాయి. ముఖ్యంగా ఐటీ కారిడార్‌లో ఈ ఏడాది సెప్టెంబర్ వరకు జరిగిన ప్రమాదాల్లో 190 మంది పాదచారులు మరణించారు. ఈ గణంకాల నేపథ్యంలో.. పాదచారుల భద్రతకు స్కైవేల నిర్మాణం వల్ల ఈ సమస్యను చాలా వరకు పరిష్కరించవచ్చని అంటున్నారు.

# ఆర్చరీ లీగ్ ఫస్ట్ సీజన్ సక్సెస్..



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ఇటీవల ఢిల్లీలో ఆర్చరీ ప్రీమియర్ లీగ్ (–2025) ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇది భారతదేశంలో మొట్టమొదటి ఆర్చరీ ఫ్రాంచైజీ టోర్నమెంట్. అక్టోబర్ 2 నుంచి 12 వరకూ ఈ లీగ్ జరుగుతోంది. అనిల్ కామినేని నేతృత్వంలో ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేసిన ఈ లీగ్ కి చెర్రీ బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవరిస్తున్నారు. ఆర్చరీ ఫస్ట్ లీగ్ సక్సెస్ ఫుల్ గా నిర్వహించిన సందర్భంగా రామ్ చరణ్ దంపతులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిశారు. రామ్ చరణ్, ఉపాసన, ఆర్చరీ ప్రీమియర్ లీగ్ చైర్మన్ అనిల్ కామినేని, ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు విరేందర్ సచ్‌దేవా శనివారం (అక్టోబర్ 11) న్యూఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిశారు. లీగ్‌కు సంబంధించిన వివరాలను ఆయనకు వివరించారు. ప్రాచీన భారతదేశ క్రీడ అయిన ఆర్చరీని జాతీయ అంతర్జాతీయ స్థాయిలో తిరిగి వెలుగులోకి తీసుకురావాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఆర్చరీ లీగ్ తొలి సీజన్ విజయవంతంగా పూర్తయిన సందర్భంగా వారికి ప్రధాని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ వేంకటేశ్వరస్వామి జ్ఞాపికతో పాటు, ప్రత్యేకంగా తయారు చేయించిన విల్లును మోదీకి అందించారు.

మోదీతో భేటీకి సంబంధించిన ఫొటోలను రామ్ చరణ్ సోషల్ మీడియాలో పంచుకున్నారు. "అనిల్ కామినేని గారు నేతృత్వంలో జరిగిన ప్రపంచంలోని మొట్టమొదటి ఆర్చరీ ప్రీమియర్ లీగ్ విజయంపై మన ప్రధానమంత్రి నరేంద్ర మోదీజీని కలవడం గౌరవంగా భావిస్తున్నాను. మోదీ మార్గదర్శకత్వం, క్రీడల పట్ల మక్కువ ప్రపంచవ్యాప్తంగా ఆర్చరీ వారసత్వాన్ని కాపాడటానికి, ప్రోత్సహించడానికి మాకు సహాయపడుతుంది. అథ్లెట్స్ కు నా అభినందనలు. మెరుగైన మానసిక, శారీరక ఆరోగ్యం కోసం ఈ అద్భుతమైన క్రీడలో ఇంకా చాలా మంది చేరతారని మేము ఆశిస్తున్నాము" అని ఇన్స్టాగ్రామ్ లో పేర్కొన్నారు.ూ

# 'ఫౌజీ'పై అదిరిపోయే అప్‌డేట్స్..



టాలీవుడ్ స్టార్ హీరో ప్రభాస్ వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నాడు. ప్రస్తుతం ఆయన హను రాఘవపూడి దర్శకత్వంలో ఓ పీరియాడిక్ యాక్షన్ డ్రామాలో నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఈ సినిమాను అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ ఇమాన్వి ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తోంది. సినీ వర్గాల సమాచారం ప్రకారం ఇప్పటికే దాదాపు 60 శాతం చిత్రీకరణ పూర్తయింది. ప్రభాస్‌కు సంబంధించిన సన్నివేశాలు ఇంకా 35 రోజులపాటు చిత్రీకరించాల్సి ఉందని తెలుస్తోంది. ఈ చిత్రానికి 'ఫౌజీ' అనే పేరు పరిశీలనలో ఉందని టాలీవుడ్ సర్కిల్‌లో చర్చ జరుగుతోంది.

రెండో ప్రపంచ యుద్ధ నేపథ్యంలో సాగే ఈ కథలో ప్రభాస్ బ్రిటీష్ ఆర్మీ ఆఫీసర్‌గా కనిపించనున్నాడని తెలుస్తోంది. హను రాఘవపూడి తన సినిమాల్లో భావోద్వేగాలను చక్కగా మేళవించే దర్శకుడిగా పేరుపొందాడు. కాబట్టి ప్రభాస్ యాక్షన్ ఇమేజ్‌తో ఆయన ఎమోషనల్ టచ్ కలిస్తే ప్రేక్షకులకు ఒక కొత్త అనుభవాన్ని అందించే అవకాశముంది. ఈ కథలో యుద్ధం, త్యాగం, దేశభక్తి ప్రధానాంశాలుగా ఉంటాయని వినిపిస్తోంది. ఈ చిత్రాన్ని 2026 ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విడుదల చేయాలని చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది. దీనిపై అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడనుంది.

ఈ చిత్రానికి సంబంధించి మరో ఆసక్తికర విషయం వినిపిస్తోంది. 'ఫౌజీ'కి ప్రీక్వెల్ చేయాలనే ఆలోచనలూ నిర్మాతల్లో ఉన్నట్లు సమాచారం. కథ పరంగా విస్తృతమైన ప్రపంచం ఉండటంతో ఈ కథను సిరీస్‌లా కొనసాగించే వీలుందని టాక్ వినిపిస్తోంది. ఇది ప్రభాస్ ఫ్యాన్స్‌కి నిజంగా పండగలాంటి వార్తే. 'ఫౌజీ' చిత్రంలో ప్రముఖ నటులు మిథున్ చక్రవర్తి, జయప్రద, అనుపమ్ ఖేర్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సినిమాకు సంబంధించిన సెట్ వర్క్, ఆర్ట్ డైరెక్షన్, కాస్ట్యూమ్ డిజైన్ వంటి అంశాలను అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందిస్తున్నారు. సైనిక నేపథ్యానికి తగినట్లుగా యాక్షన్ సన్నివేశాలు, విజువల్ ఎఫెక్ట్స్ కూడా భారీ స్థాయిలో ఉండనున్నాయి. ఇక ప్రభాస్ ప్రస్తుతం నటిస్తున్న మరో భారీ ప్రాజెక్ట్ 'ది రాజాసాబ్' చిత్రీకరణ కూడా చివరి దశలో ఉంది. యూరోప్‌లో మూడు సాంగ్స్ చిత్రీకరించేందుకు యూనిట్ అక్కడికి వెళ్లనుంది. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా 2026 సంక్రాంతి సందర్భంగా జనవరి 9న విడుదల కానుంది. ఫ్యామిలీ, హారర్, కామెడీ అంశాలతో కూడిన ఈ చిత్రం ప్రభాస్ కెరీర్‌లో కొత్త మలుపు తిప్పేలా ఉంటుందని అభిమానులు ఆశిస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన ట్రైలర్ 1కి విశేష రెస్పాన్స్ వచ్చింది.ఇంకా స్పిరిట్, సలార్ 2, కల్కి 2 చిత్రాలు ఉన్నాయి. ప్రభాస్ ప్రస్తుతం తన ప్రతి సినిమాతో పాన్ ఇండియా స్థాయిని దాటుకుని గ్లోబల్ మార్కెట్ వైపు అడుగులు వేస్తున్నారు. యాక్షన్, ఎమోషన్, దేశభక్తి కలయికతో రూపొందుతున్న 'ఫౌజీ' చిత్రం ఆయన కెరీర్‌లో మరో మైలురాయిగా నిలిచే అవకాశముంది.

# కళ్లు చెదిరే రెమ్యునరేషన్..



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రస్తుతం అట్లీ కుమార్ దర్శకత్వంలో ఓ భారీ చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో దీపికా పదుకునే హీరోయిన్ గ నటిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాపై అంచనాలు ఓ రేంజ్ లో ఉన్నాయి. అందుకే ఏ చిన్న న్యూస్ బయటకు వచ్చినా క్షణాల్లో వైరల్ అవుతుంది. అయితే ఇప్పుడు బన్నీ రెమ్యునరేషన్ గురించి నెట్టింట చర్చలు జరుగుతున్నాయి.

'పుష్ప 2: ది రైజ్' మూవీతో అల్లు అర్జున్ తన కెరీర్ లోనే కాదు, ఇండియన్ సినిమాలోనే బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ అందుకున్నారు. దీంతో బన్నీ రేంజ్, ఇమేజ్, క్రేజ్ ఎక్కడికో వెళ్లిపోయింది. ఆయన మార్కెట్ ఒక్కసారిగా పెరిగిపోయింది. దీంతో పారితోషికం కూడా భారీగా పెంచేశారని టాక్. ఇప్పుడు అట్లీ మూవీ కోసం ఏకంగా 175 కోట్ల రూపాయల రెమ్యునరేషన్ తీసుకుంటున్నట్టు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. బన్నీ స్టార్ డమ్ ని దృష్టిలో పెట్టుకొని డిమాండ్ మేరకు పారితోషికం చెల్లించడానికి నిర్మాతలు రెడీ అయ్యారట.

మామూలుగా హీరో కానీ, దర్శక నిర్మాతలు కానీ ఎప్పుడూ రెమ్యునరేషన్ వివరాలని అఫిషియల్‌గా అనౌన్స్ చేయరు. ప్రభుత్వానికి పన్నులు కడతారే తప్పితే, ఎంత సంపాదిస్తున్నారనేది ఎవరూ బయటకు వెల్లడించరు. కానీ ఫిలిం సర్కిల్స్ లో వినిపించే టాక్ ని బట్టి, సినిమా టీం లీక్ చేసే అంశాలను బట్టి బడ్జెట్, రెమ్యునరేషన్స్ వంటివి నెట్టింట ప్రచారం చేస్తుంటారు. ఇప్పుడు ఆ విధంగానే అల్లు అర్జున్ రూ.175 కోట్లు తీసుకుంటున్నట్లు చెప్పుకుంటున్నారు. ఒకవేళ ఇదే కనుక నిజమైతే మాత్రం ఇండియన్ సినిమాలో అత్యధిక పారితోషికం తీసుకునే హీరోలలో ఒకరిగా నిలిచే అవకాశం ఉంది.

ఇండియన్ సినిమాలో హయ్యెస్ట్ రెమ్యునరేషన్ తీసుకునే యాక్టర్స్ లిస్టులో షారుఖ్ ఖాన్, ఆమిర్ ఖాన్, రజనీకాంత్, ప్రభాస్ వంటి హీరోలు ఉంటారు. సినిమాకి ఇంత అని పారితోషికం తీసుకునేవారు కొందరైతే, కాల్షీట్ కి ఇంతని ఛార్జ్ చేసేవారు ఇంకొందరు ఉన్నారు. సినిమా నిర్మాణంలో పార్టనర్ షిప్ తీసుకొని లాభాల్లో వాటాలు తీసుకునేవారు.. ఏరియాల రైట్స్ కావాలని అడిగేవారు కూడా ఉన్నారు. ఇప్పుడు అల్లు అర్జున్ కూడా భారీగా తీసుకుంటున్నారని, ఏకంగా రూ. 175 కోట్ల పారితోషికం ఛార్జ్ చేస్తున్నారని అంటున్నారు. దీని ప్రకారమా బన్నీ హయ్యెస్ట్ రెమ్యునరేషన్ తీసుకునే టాలీవుడ్ హీరోగా టాప్ లో నిలిచాడని చెప్పాలి.

సైన్స్ ఫిక్షన్ అడ్వెంచరస్ మూవీహా సినిమా రూపొందుతోంది. దీనికి రూ. 700 కోట్ల భారీ బడ్జెట్ అవుతుందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారట. అందులో రూ. 175 కోట్లు బన్నీకి ఇస్తే.. రూ. 250 కోట్లు కేవలం గ్రాఫిక్స్ కోసం కేటాయిస్తున్నారట. డైరెక్టర్, హీరోయిన్లు, టెక్నిషియన్స్ రెమ్యునరేషన్స్.. ప్రొడక్షన్ కాస్ట్ అంతా కలిసి మరో రూ.250 కోట్లు అంచనా వేస్తున్నారట. ఇందులో నిజమెంతనేది తెలియదు కానీ.. అల్లు అర్జున్ పారితోషికం, బడ్జెట్ వివరాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# 'ఓజీ' హీరోయిన్ స్ట్రాంగ్ వార్నింగ్



అందం, అభినయం కలబోసిన హీరోయిన్ ప్రియాంక అరుళ్ మోహన్‌కి టాలీవుడ్ మంచి ఫాలోయింగ్ ఉంది. నాని సరసన 'గ్యాంగ్ లీడర్' చిత్రంతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన ఈ చెన్నై బ్యూటీ ఆ తర్వాత శర్వానంద్‌తో 'శ్రీకారం', నానితో 'సరిపోదా శనివారం' చిత్రాల్లో నటించింది. డాక్టర్ వరుణ్, డాన్ వంటి డబ్బింగ్ చిత్రాలతోనూ ఇక్కడ పాలోయింగ్ పెంచుకుంది. ఆమె క్యూట్ లుక్స్‌కి సోషల్‌మీడియాలో సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉంటుంది. అదే ఏకంగా పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ పక్కన నటించే అవకాశం తెచ్చిపెట్టింది. ఇటీవల వచ్చిన 'ఓజీ' చిత్రంలో పవన్ కళ్యాణ్ భార్యగా కన్మణి అనే పాత్రలో ఆకట్టుకుంది ప్రియాంక మోహన్ . ఆ చిత్రం బ్లాక్‌బస్టర్ కావడంతో తెలుగులో ఆమెకు మరిన్ని అవకాశాలు తలుపు తడుతున్నాయి. తెలుగులో ఎప్పటినుంచో సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న ఆమెకు 'ఓజీ' రూపంలో మంచి హిట్ లభించింది.

ఈ సంతోషంలో ఉండగానే ప్రియాంక మోహన్‌కి ఊహించని షాక్ తగిలింది. బయట, సినిమాల్లోనూ ఆమె ఎంత పద్ధతిగా ఉంటుందో అందరికీ తెలిసిందే. అలాంటిది సోషల్‌మీడియాలో ఆమె మొహంతో కొన్ని ఫేక్ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. అందులో ప్రియాంక అసభ్యంగా, ఓవర్ ఎక్స్‌పోజింగ్ చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఆ ఫోటోలు చూసిన నెటిజన్లు ప్రియాంక ఇలా మారిపోయిందేంటి అనుకుంటూ వాటిని తెగ షేర్ చేస్తున్నారు. అయితే కొందరు మాత్రం అవి ఫేక్ ఫోటోలని, ప్రియాంక ఎప్పటికీ అలా చేయదని ఆమెకు సపోర్టుగా నిలుస్తున్నారు.

ఈ విషయం ప్రియాంక దృష్టికి వెళ్లడంతో ఆమె ఘాటుగా స్పందిస్తూ ట్వీట్ చేసింది. 'ఏఐ ద్వారా నన్ను తప్పుగా చూపిస్తూ క్రియేట్ చేసిన ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఏఐ టెక్నాలజీని క్రియేవిటీ కోసం వాడుకోవాలి తప్ప తప్పుడు సమాచారం సృష్టించడానికి కాదు. ఇలాంటి ఫేక్ ఫోటోలు క్రియేట్ చేసేవారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. తమ పైశాచిక ఆనందం కోసం ఎదుటివారిని చులకనగా చూపించేవారిని ఏం చేసినా తప్పులేదని కామెంట్లు చేస్తున్నారు. మంచి కోసం వాడుకోవాలి తప్ప ఇలాంటి చెత్త పనుల కోసం వినియోగిం చడం దారుణమని అభిప్రాయపడు తున్నారు.

# నటుడు శ్రీకాంత్ భరత్‌పై పోలీసులకు ఫిర్యాదు



మహాత్మా గాంధీపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన టాలీవుడ్ నటుడు శ్రీకాంత్ భరత్‌పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. యునైటెడ్ ఎన్జీఓస్ అసోసియేషన్, సేవాలాల్ బంజారా సంఘం సభ్యులు ఆయనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన గాంధీపై అవమానకర వ్యాఖ్యలు చేయడం అంగీకారయోగ్యం కాదని, కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గాంధీని కించపరిచే వ్యాఖ్యలు దేశ ప్రజల భావోద్వేగాలను దెబ్బతీస్తాయని విమర్శకులు మండిపడుతున్నారు.

వివాదాస్పద వ్యాఖ్యలతో తరుచూ వార్తల్లో నిలిచే సినీనటుడు శ్రీకాంత్ భరత్ ఇటీవల మహాత్మాగాంధీపై చేసిన కామెంట్స్ తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చింది గాంధీ కాదు. నేతాజీ సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్ లాంటి లక్షలాది మంది ప్రాణ త్యాగంతోనే స్వాతంత్ర్యం వచ్చింది. గాంధీజీ ఎంతో మంది స్త్రీలని లైంగి కంగా వేధించారని చరిత్ర చెబుతోంది. ఆయన మహాత్ముడు కాదు దుర్మార్గుడు' అంటూ అసభ్య పదజాలంతో, బూతులతో రెచ్చిపోయాడు శ్రీకాంత్. దీంతో చాలామంది ఆయనపై విరుచుకుపడ్డారు. అహింసా సిద్ధాంతంతో ప్రపంచానికే మార్గదర్శకుడైన మహాత్మా గాంధీపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడతావా అంటూ సోషల్‌మీడియాలో నెటిజన్లు కామెంట్ల వర్షం కురిపించారు. ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు, పోలీసులకు రిక్వెస్ట్ చేశారు.

గాంధీజీపై చేసిన అసభ్యకరమైన వ్యాఖ్యలకు గాను తాజాగా శ్రీకాంత్ భరత్‌పై పోలీసులకు ఫిర్యాదు అందింది. యునైటెడ్ ఎన్జీఓస్ అసోసియేషన్ సభ్యులు, సేవాలాల్ బంజారా సంఘం ప్రతినిధులు పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేశారు. మహాత్మా గాంధీని నటుడు శ్రీకాంత్ అయ్యంగార్ వ్యక్తిగతంగా దూషించారు. నిరాధార ఆరోపణలు చేసి ఆయన గౌరవాన్ని కించపరిచారు. దేశం గర్వించే మహనీయులపై ఇలాంటి వ్యాఖ్యలు సమాజంలో అసహనాన్ని రెచ్చగొట్టే ప్రమాదం ఉంది. కాబట్టి ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి" అని వారు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

శ్రీకాంత్ భరత్‌పై ఇలాంటి వివాదాలు కొత్తేమీ కాదు. ఏపీలో వైసీపీ ప్రభుత్వ హయాంలో విజయవాడకి వెళ్లిన ఆయన బూమ్ బూమ్ బీర్లపై చేసిన వీడియో తెగ వైరల్ అయింది. వైసీపీ కేడర్ ఆయనపై తీవ్రస్థాయిలో విరుచుకుపడి విపరీతంగా ట్రోల్ చేసింది. ఆ తర్వాత సినీ జర్నలిస్టులు బాత్‌రూమ్‌లోని క్రిముల కంటే నీచమైన వాళ్లంటూ వివాదాస్పద కామెంట్లు చేశారు. దీంతో సినీ జర్నలిస్టులు ఆయనపై ఫిర్యాదులు చేయగా.. ఎవరేమి చేసుకున్నా తాను వెనక్కి తగ్గేది లేదంటూ తెగేసి చెప్పారు. సుమారు పదేళ్లుగా ఇండస్ట్రీలో ఉన్న శ్రీకాంత్ చాలా సినిమాల్లో నటించి ప్రతిభావంతుడైన నటుడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు. సహజమైన నటనతో పాత్రకి ప్రాణం పోస్తాడని ప్రేక్షకులు పొగుడుతూ ఉంటారు. అయితే వ్యక్తిగత విషయానికొచ్చేసరికి ఆయనకి నోటి దురుసు ఎక్కువని తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే తరుచూ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ వార్తల్లోకి ఎక్కడం పరిపాటిగా మారిపోయింది.

# 'ఎల్లమ్మ' బెల్లంకొండకు చేరిందా?..



'బలగం' సినిమాతో డైరెక్టర్ గా బ్లాక్ బస్టర్ హిట్టు కొట్టిన వేణు యెల్దండి.. చాలాకాలంగా 'ఎల్లమ్మ' అనే స్క్రిప్ట్ మీద వర్క్ చేస్తున్నారు. దిల్ రాజు బ్యానర్ లో ఈ కథ తెరకెక్కనుంది. ఎప్పటి నుంచో వార్తల్లో ఉంటున్న ప్రాజెక్ట్.. ఇంకా సెట్స్ పైకి వెళ్లలేదు. బలగం వచ్చి రెండున్నరేళ్లు దాటిపోయింది కానీ, ఇంతవరకూ అధికారిక ప్రకటన లేదు. ఎప్పుడు పట్టాలెక్కుతుందో తెలియడం లేదు. లేట్ అయ్యే కొద్దీ సినిమాపై రకరకాల రూమర్స్ పుట్టుకొస్తూనే ఉన్నాయి. తాజాగా మరో కొత్త పుకారు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. 'ఎల్లమ్మ' సినిమాని హీరో నితిన్ తో చేయనున్నట్లు దిల్ రాజు గతంలో ప్రకటించారు. 'తమ్ముడు' రిలీజైన తర్వాత ఈ ప్రాజెక్ట్ ని సెట్స్ మీదకు తీసుకెళ్తామని చెప్పారు. తమ్ముడు వచ్చి బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ గా మారింది. సినిమా రిలీజై మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటిదాకా ఎల్లమ్మ ఊసే లేదు. దీంతో ఎల్లమ్మ చేతులు మారిందని, నితిన్ ప్లేస్ లో మరో హీరోని తీసుకుంటున్నారనే ప్రచారం మొదలైంది. ముందుగా శర్వానంద్ పేరు వినిపించింది. ఇప్పుడు ఇంకో హీరో పేరు తెర మీదకు వచ్చింది. 'ఎల్లమ్మ' సినిమా కోసం బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తో సంప్రదింపులు జరుపుతున్నారని ఓ ఆసక్తికరమైన రూమర్ నెట్టింట చక్కర్లు కొడుతోంది. నితిన్ ని కాదని బెల్లంకొండతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాలని చూస్తున్నారని, ఇప్పటికే డిస్కషన్స్ జరుగుతున్నాయని టాక్ నడుస్తోంది. 'కిష్కింధపురి'తో బ్లాక్ బస్టర్ సక్సెస్ సాధించిన శ్రీనివాస్ లైనప్ లోకి మరో క్రేజీ ప్రాజెక్ట్ వచ్చిందని ఫిలిం సర్కిల్స్ లో చెప్పుకుంటున్నారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ లో త్వరలోనే అనౌన్స్ మెంట్ వచ్చే అవకాశం ఉందని అనుకుంటున్నారు. ఇందులో నిజమెంతనేది తెలియదు కానీ.. సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. నిజానికి 'ఎల్లమ్మ' కథ రాసుకున్న తర్వాత హీరో నానికి వినిపించారు. కస్టోరీ నచ్చినప్పటికీ ఇతర కమిట్మెంట్స్ కారణంగా నాని నటించలేకపోయారు. దీంతో నితిన్ తో చేయాలని దిల్ రాజు నిర్ణయించుకున్నారు. అద్భుతమైన కథ అని, పర్ఫార్మెన్స్‌కి స్కోప్ ఉన్న సినిమా అని నితిన్ పలు సందర్భాల్లో చెప్పారు.

PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS. H.NO.18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M) MEDCHA-500047, MEDCHAL MALKAJGIRI DISTRICT, TELANGANA PUBLISHED FROM H.NO 02-66/254, MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL - 500055, DISTRICT MALKAJGIRI, TELANAGANA, EDTIOR : G. DAYAKAR REDDY, RNI : TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040-45046154